RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..



**రూ. 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం**

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | ఆదివారం, జూన్ 28, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 67 | పేజీలు: 8 | వెల : రూ.1



## బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ: రాంచందర్‌రావు

**బీజేపీ విజయానికి హైదరాబాద్ నుంచే నాంది**

**బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా బీజేపీని ఓడించలేవని ధీమా**

**బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణ వైపు చూస్తోందన్న లక్ష్మణ్**

హైదరాబాద్ : పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కంచు కోటను బద్దలు కొట్టి అధికారంలోకి రావడంతో దేశ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో సైతం ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణలో విజయఢంకా మోగించడమే బీజేపీ నెక్స్ట్ టార్గెట్ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచే ఈ విజయానికి నాంది పలుకుతామని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి చూపెడతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి వచ్చినా సరే.. బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రేపు హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. మరోవైపు వరంగల్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... బీజేపీ జాతీయ నాయకత్వం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. ఈనెల 29న నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటిస్తారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. బీజేపీని కాదని కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందని అన్నారు.

### తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త..

# జూలై 15 నుంచి కొత్త ఆరోగ్య పథకం

**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్యమే లక్ష్యం**

**ఉద్యోగ దంపతుల్లో ఒకరి జీతం నుంచే కంట్రిబ్యూషన్ వసూలుకు నిర్ణయం**

**త్వరలోనే ఆసుపత్రుల జాబితా, ప్యాకేజీ రేట్లను ప్రకటించనున్న ప్రభుత్వం**



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన, క్రమబద్ధమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూపొందించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను జూలై 15న ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సదుపాయం కల్పించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఇటీవల జరిగిన ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశంలో

(మిగతా 2వ పేజీలో)



## 'సర్'ను సీరియస్‌గా తీసుకోండి: కేటీఆర్

**మహేశ్వరం బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్**

**కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్‌కే మెజార్టీ వస్తుందని వెల్లడి**

**రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా**

మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతలు వచ్చాయని.. రైతుబంధు పోయి 'రాహుల్ బంధు' వచ్చిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి, కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆరోపించారు. మహేశ్వరంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే సబితా ఇంద్రారెడ్డి గెలుపు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమనిపించిందన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నా.. జనం మాత్రం 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను సీరియస్ గా తీసుకోవాలని... అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.



వాయిస్ ఆఫ్ ప్రజలు
ఆదివారం, జూన్ 28, 2026

# హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా అజిత్‌రెడ్డి

**ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా ౧**
**కొనసాగుతున్న అజిత్ రెడ్డికి అదనపు బాధ్యతలు**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ**

**మెట్రో ఫేజ్-2 విస్తరణ ప్రయత్నాల మధ్య ఈ నియామకం ప్రాధాన్యం**

హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ అధికారి బి. అజిత్ రెడ్డి నియమితులయ్యారు. ఆయనకు ఈ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అజిత్ రెడ్డి పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని 'ఇన్వెస్ట్ తెలంగాణ' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్ (ఐడీఈఎస్) అధికారి అయిన అజిత్ రెడ్డికి, రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఈ కొత్త బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ నగరంలో పట్టణ రవాణా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే క్రమంలో ఈ నియామకం అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. ప్రస్తుతం సర్ఫరాజ్ అహ్మద్ హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని



వైష్ణవ్‌తో సమావేశమై మెట్రో రైలు విస్తరణపై చర్చించారు. మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ ప్రణాళికల కోసం ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ (ఎస్‌బీఐక్యాప్స్)ను కన్సల్టెంట్‌గా నియమించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

# ఇందిరమ్మ ఇళ్లు: స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

**నిర్మాణ వ్యయం పెరగకుండా అదుపు చేసేందుకే ఈ నిర్ణయం**

**500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యే స్లాబ్ ఉండాలని ఆదేశం**

**ముందువైపు 3అడుగులు, మిగతా వైపులా ఒక అడుగు మించరాదని స్పష్టీకరణ**

**లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని గుర్తించిన గృహ నిర్మాణ సంస్థ**

హైదరాబాద్ : తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వ్యయం లబ్ధిదారులకు భారంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల స్లాబ్ పరిమాణంపై పరిమితులు విధిస్తూ శనివారం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. పేద లబ్ధిదారులు అనవసరపు ఖర్చులతో అప్పుల పాలు కాకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఇకపై ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్‌ను 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించుకోవాలి. స్లాబ్ ప్రొజెక్షన్ (ఓవర్‌హ్యాంగ్) ముందువైపు మూడు అడుగులు, మిగతా మూడు వైపులా ఒక్క అడుగుకు మించరాదని స్పష్టం చేశారు. కొత్తగా చేపట్టే నిర్మాణాలతో పాటు, ప్రస్తుతం బేస్‌మెంట్ లేదా రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. చాలామంది లబ్ధిదారులు అవసరానికి మించి పెద్ద సైజులో స్లాబులు వేస్తుండటంతో నిర్మాణ వ్యయం అమాంతం పెరుగుతోందని గృహ నిర్మాణ సంస్థ గుర్తించింది. గోడల నుంచి ఎనిమిది అడుగుల వరకు కూడా స్లాబులను పొడిగిస్తున్న సందర్భాలు ఉన్నాయని, దీనివల్ల పేద లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోతోందని అధికారులు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం ఈ పరిమితులు




విధించింది. ఎండ, వానల నుంచి రక్షణ కోసం భారీ ఆర్‌సీసీ స్లాబులకు బదులుగా కిటికీలు, తలుపులపై సన్‌షేడ్లు, టైల్డ్ రూఫ్‌లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందిరమ్మ పథకం కింద అర్హులైన పేదలకు సొంత ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సాయం దుర్వినియోగం కాకుండా, లబ్ధిదారులకు భారం కలగకుండా గృహ నిర్మాణం పూర్తి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ కొత్త నిబంధనలపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందిని ప్రభుత్వం ఆదేశించింది.

# తెలంగాణకు చల్లని కబురు.. వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు!

**రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణలో భారీ వర్షాలు**

**రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ**

**ఉత్తర, తూర్పు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం**

**ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు నేడు ఎల్లో అలర్ట్**

**హైదరాబాద్‌లో రాత్రికి భారీ వర్షం పడే సూచనలు**



నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి చాలా రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే, తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రానున్న ఏడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం.. నేడు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. వీటితో పాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్ష సూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. జులై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొంది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది. ఇక, రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది. ఈరోజు మధ్యాహ్నం తర్వాత తేలికపాటి జల్లులతో ప్రారంభమై, సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలో భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

## ముంబైలో భారీ విషప్రయోగ కుట్ర భగ్నం..
# 15 వేల క్యాప్సూల్స్ స్వాధీనం

**మొహర్రం ఊరేగింపును లక్ష్యంగా చేసుకున్న విషప్రయోగ కుట్ర భగ్నం**

**నొప్పి నివారణ మందుల పేరుతో ఎలుకల మందు పంపిణీకి పన్నాగం**

**నిందితుడి అంతర్జాతీయ ప్రయాణాలపై పోలీసుల లోతైన దర్యాప్తు**

ముంబైలో జరగాల్సిన మొహర్రం ఊరేగింపును లక్ష్యంగా చేసుకుని, పెద్ద ఎత్తున సామూహిక విషప్రయోగానికి పన్నిన భారీ కుట్రను ముంబై పోలీసులు భగ్నం చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూణెకు చెందిన ఓ వ్యాపారవేత్తను అరెస్టు చేసి, అతడి నుంచి దాదాపు 15,000 విషపూరిత క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సత్వర స్పందనతో నగరంలో ఓ పెను విషాదం తప్పినట్లయింది. పోలీసుల కథనం ప్రకారం, పూణెలోని విమాన్ నగర్‌కు చెందిన పెయింట్ వ్యాపారి ఫయాజ్ ప్రేమ్‌జీ (39) ఈ కుట్రకు పాల్పడ్డాడు. దక్షిణ ముంబైలోని డోంగ్రీ ప్రాంతంలో ఓ అతిథి గృహంలో బస చేసిన ఆయన, మొహర్రం ఊరేగింపులో పాల్గొనే భక్తులకు నొప్పి నివారణ మందులు లేదా ఇమ్యూనిటీ బూస్టర్లని నమ్మించి ఎలుకల మందు నింపిన క్యాప్సూల్స్‌ను పంపిణీ చేయాలని పథకం వేశాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తికి మాత్ర ఇవ్వగా, అతడికి వాంతులు, కడుపునొప్పి రావడంతో పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి అత్యంత విషపూరితమైన జింక్ ఫాస్ఫైడ్‌తో నింపిన 14,900 క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గడిచిన ఏడాది కాలంలో నిందితుడు ఇరాన్, ఇరాక్ దేశాలకు 19 సార్లు ప్రయాణించినట్లు విచారణలో తేలింది. అతడి తల్లి, సోదరి ప్రస్తుతం ఇరాన్‌లోనే నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుట్ర వెనుక అంతర్జాతీయ కోణం ఉందా? లేక ఒంటరిగానే ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత కింద హత్యాయత్నం, విషప్రయోగం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



# రూ. 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం

భద్రాచలం : ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన భద్రాద్రి ఆలయ మాస్టర్ ప్లాన్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. భద్రాద్రి క్షేత్ర అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్ ఆలయ పరిసరాల్లో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఈ మెగా ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. భద్రాచలం రామాలయ రూపురేఖలను మార్చేలా మొత్తం రూ. 200.89 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ తొలి విడత అభివృద్ధి పనులను చేపట్టారు. ఆలయానికి తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపు ఉన్న పాత నిర్మాణాల తొలగింపు పనులు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఆలయ పరిసరాల క్లియరెన్స్ పూర్తయిన తర్వాత... ప్రభుత్వం సిద్ధం చేసిన కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పూర్తి శాస్త్రోక్తంగా, ఆగమ శాస్త్ర నియమాలను పాటిస్తూ అభివృద్ధి పనులు చేపడతారు. వచ్చే సంవత్సరం శ్రీరామ నవమి పండుగ నాటికి ఈ ఆలయ నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త..
# జూలై 15 నుంచి కొత్త ఆరోగ్య పథకం

పథకం ప్రారంభ తేదీని ఖరారు చేశారు. వారం రోజుల్లోగా వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలతో ట్రస్ట్ సభ్యులు కీలక భేటీ నిర్వహించనున్నారు. ఆ తర్వాత నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలు, చికిత్సల ప్యాకేజీ ధరలు, ఎంప్యానెల్ చేసిన ఆసుపత్రుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పథకంలో భాగంగా ఉద్యోగుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన పక్షంలో, వారిలో ఒకరి వేతనం నుంచి మాత్రమే హెల్త్ కంట్రిబ్యూషన్‌ను మినహాయించనున్నారు. ఈ నిర్ణయం వల్ల అటువంటి ఉద్యోగ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో పూర్తి పారదర్శకతను నిర్ధారిస్తూ, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేకంగా 'ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ట్రస్ట్ పర్యవేక్షణలోనే నూతన ఆరోగ్య పథకం అమలు కానుంది.

## ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో
# ఏ ఒప్పందాలు జరిగాయి?: హరీశ్‌రావు

**చంద్రబాబు, రేవంత్, డీకే శివకుమార్ భేటీపై హరీష్ స్పందన**

**తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే**
**చారిత్రక ఒప్పందం అని రేవంత్ అంటున్నారని విమర్శ**

**శిష్యుడు సీఎం అయ్యాడని చంద్రబాబు గుండ్రేవులను తీసుకొస్తున్నారని ఆరోపణ**



హైదరాబాద్ : కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు (చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్) జరిపిన రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో సీఎంలు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురు మాత్రమే కూర్చుని ఏం చర్చించారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులు ముందుకు వెళుతుంటే, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'చారిత్రక ఒప్పందం' అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులను బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని... కానీ ఇప్పుడు ఏపీ సీఎం తన 'శిష్యుడు' రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును తీసుకురావడం జరుగుతోందని ఆరోపించారు. ఆర్డీఎస్‌కు స్పష్టమైన నీటి కేటాయింపులు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించిన హరీష్ రావు... రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ సగటున 4 టీఎంసీలు మాత్రమే తెచ్చుకుంటే, బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున అనుమతులు తెచ్చుకున్నామని గుర్తు చేశారు."మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నాం. ఇంకా 138 టీఎంసీలు రావాలి. రేవంత్ రెడ్డి తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావద్దు" అని వ్యాఖ్యానించారు.

# ఆ రెండు చట్టాల గురించి ఒవైసీ చదవాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**పాస్‌పోర్ట్, పౌరసత్వంపై ఒవైసీ వ్యాఖ్యలను ఖండించిన కిషన్ రెడ్డి**

**ఓటరు జాబితా సవరణ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం**

**ప్రజల్లో అనవసర ఆందోళన సృష్టించవద్దని ఒవైసీకి హితవు**

**బారిస్టర్ అయిన ఒవైసీ చట్టాలను సరిగా చదవాలన్న కేంద్ర మంత్రి**



పాస్‌పోర్ట్‌ను పౌరసత్వంతో ముడిపెడుతూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఒవైసీ వ్యాఖ్యలు చట్టవిరుద్ధమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో వీరిద్దరి మధ్య చెలరేగిన మాటల యుద్ధం రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. తెలంగాణలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై స్పందిస్తూ.. తుది జాబితాలో పేర్లు లేని పక్షంలో సదరు వ్యక్తుల పౌరసత్వంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సందేహాలు తలెత్తే అవకాశం ఉందని, పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ ఇబ్బందులు ఎదురవుతాయని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. "పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి తిరుగులేని ఆధారమని విదేశాంగ శాఖ స్పష్టం చేయనప్పటికీ, అది భారత పౌరులకు మాత్రమే అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం జారీ చేసే అత్యంత కీలకమైన పత్రం" అని ఆయన పేర్కొన్నారు. బారిస్టర్ కోర్సు చదివిన ఒవైసీ, పౌరసత్వ చట్టం-1955, పాస్‌పోర్ట్ చట్టం-1967లను మరోసారి అధ్యయనం చేసి మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అనవసర ఆందోళనలను సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ఈ తాజా వివాదం తెలంగాణ రాజకీయాల్లో పత్రాల పరిశీలన, ఓటరు జాబితా సవరణ, పౌరసత్వం వంటి సున్నితమైన అంశాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

## తిరుమలలో భారీ రద్దీ..
# సోమవారం శ్రీవాణి, వీఐపీ దర్శనాలు రద్దు

శ్రీవారి దర్శనార్థం తిరుమల కొండకు భక్తులు పోటెత్తడంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. అనూహ్యంగా పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని, సోమవారం జారీ చేయాల్సిన శ్రీవాణి కరెంట్ బుకింగ్ టికెట్లతో పాటు, వీఐపీ సిఫార్సు లేఖలపై కేటాయించే దర్శనాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. శనివారం, జూన్ 27న టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి (ఏఈవో) వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి క్యూలైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జూన్ నెలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందని, ప్రతిరోజూ 80 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. శనివారం నాటికి దాదాపు 1.5 లక్షల మంది భక్తులు దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారని, ఆదివారం కూడా ఇదే స్థాయిలో రద్దీ కొనసాగే అవకాశం ఉందని అంచనా వేశారు. "భక్తుల రద్దీ దృష్ట్యా సోమవారం నాటి శ్రీవాణి కరెంట్ బుకింగ్ టికెట్లను, వీఐపీ సిఫార్సు లేఖల ఆధారిత దర్శనాలను రద్దు చేశాం. భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూనే, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం" అని వెంకయ్య చౌదరి వివరించారు. తిరుమల కొండపై రద్దీని సమర్థవంతంగా నియంత్రించి, సామాన్య భక్తులకు దర్శన ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ వర్గాలు వెల్లడించాయి.

# గర్భాశయం వెలుపల పిండం పెరగడంతో ప్రాణాపాయ స్థితికి చేరిన యువతికి అత్యవసర శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన మెడికవర్ హాస్పిటల్స్ చందానగర్ వైద్యులు




పటాన్ చెరు (వాయిస్ టుడే): తీవ్ర కడుపు నొప్పి, రక్తపోటు ప్రమాదకర స్థాయికి పడిపోవడం, అధిక అంతర్గత రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో మెడికవర్ హాస్పిటల్స్‌కు చేరిన 34 ఏళ్ల మహిళకు వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. కొన్ని రోజులుగా నెలసరి ఆలస్యం కావడంతో పాటు తీవ్రమైన కడుపు నొప్పి, తీవ్ర నీరసం, అస్వస్థతతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు అత్యవసరంగా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించే సమయానికి ఆమె రక్తపోటు కేవలం 70/40 ఎఎంహెచ్ మాత్రమే ఉండగా, గుండె స్పందన నిమిషానికి 160 సార్లు నమోదైంది. పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో ఎమర్జెన్సీ వైద్యులు వెంటనే చికిత్స ప్రారంభించి ఐసీయూకు తరలించారు. ద్రవాలు అందించినప్పటికీ రక్తపోటు మెరుగుపడక పోవడంతో ప్రత్యేక ఇనోట్రోప్ మందుల సహాయంతో చికిత్స కొనసాగించారు. ఇదే సమయంలో రోగికి మూర్ఛ లక్షణాలు కనిపించడంతో వెంటనే వెంటిలేటర్‌పై ఉంచి శ్వాసనాళాన్ని రక్షించారు. తదుపరి నిర్వహించిన పరీక్షల్లో గర్భధారణ నిర్ధారణ కావడంతో పాటు అల్ట్రాసౌండ్‌లో గర్భాశయం వెలుపల పిండం పెరగడం (ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ), ఫెలోపియన్ ట్యూబ్ పగిలిపోవడంతో కడుపులో భారీగా రక్తస్రావం జరిగినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే బ్లడ్ బ్యాంక్‌ను అప్రమత్తం చేసి అత్యవసరంగా రక్తం అందుబాటులోకి తెచ్చి శస్త్రచికిత్స చేపట్టారు. డా. భావ్య, Senior Consultant Obstetrician & Gynecologist, Laparoscopic & Fertility Specialist నేతృత్వంలోని ప్రసూతి ఓ గైనకాలజీ బృందం అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించి పగిలిపోయిన కుడి ఫెలోపియన్ ట్యూబ్‌ను తొలగించారు. కడుపులో పేరుకుపోయిన సుమారు 1.5 నుంచి 2 లీటర్ల రక్తాన్ని తొలగించి రక్తస్రావాన్ని పూర్తిగా నియంత్రించారు.

అనంతరం డా. రాజు, Critical Care Department ఆధ్వర్యంలో ఐసీయూలో వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించారు. చికిత్స సమయంలో రోగికి అవసరమైన రక్త భాగాలను అందించడంతో పాటు ఎమర్జెన్సీ మెడిసిన్, క్రిటికల్ కేర్, ప్రసూతి ఓ గైనకాలజీ, అనస్థీషియా, బ్లడ్ బ్యాంక్ మరియు నర్సింగ్ బృందాల సమన్వయంతో సమగ్ర చికిత్స అందించారు. ఫలితంగా రోగి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడి వెంటిలేటర్, ఇనోట్రోప్ మందుల అవసరం లేకుండా కోలుకుని ప్రస్తుతం పూర్తిగా ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ అనేది మహిళల ప్రాణాలకు ముప్పు కలిగించే అత్యవసర పరిస్థితి అని తెలిపారు. నెలసరి ఆలస్యం, తీవ్రమైన కడుపు నొప్పి, తలతిరగడం, బలహీనత లేదా అకస్మాత్తుగా రక్తపోటు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో నిర్ధారణ, అత్యవసర శస్త్రచికిత్స మరియు మల్టీడిసిప్లినరీ వైద్య బృందం సమన్వయంతో చికిత్స అందించడం వల్లే ఈ మహిళ ప్రాణాలను కాపాడగలిగామని పేర్కొన్నారు.



## శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్స ఉత్సవాల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లాపూర్ జూన్ 27(వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపెట్ డివిజన్ లక్ష్మీ గణపతి ఎన్క్లవ్ లోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవ ఉత్సవాల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కోల్తుర్ మల్లేష్ ముదిరాజ్, తాజా మాజీ కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్, విష్ణు వర్ధన్ రెడ్డి, వార్డు ప్రెసిడెంట్ శంభీపూర్ సుదర్శన్, కాలనీ ప్రెసిడెంట్ సమరసింహారెడ్డి, నాయకులు రాజశేఖర్ యాదవ్, ఆకుల అశోక్, మచ్చేందర్, జితేందర్ రెడ్డి, యాదగిరి, రాజు, మల్లేష్, బాలరాజు, శ్రీశైలం, వీరస్వామి, సదానందం, శ్రీను, ప్రభు, యాకూబ్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, అశోక్ రెడ్డి, రాంబాబు, శ్రీకాంత్ యాదవ్, శ్రీధర్, మరియు స్థానికులు ఆలయ కమిటీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు..



## బిఎల్ఓలు నిర్వహిస్తున్న సర్ ( ఎస్ఐఆర్ ) ఓటు మ్యాపింగ్ ను పరిశీలించిన మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్

కుత్బుల్లాపూర్, జూన్ 27 (వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో జరుగుతున్న సర్ ఓటు మ్యాప్ ఇన్ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో స్థానిక ఓటర్లు అందరూ భాగస్వాములు అవ్వాలని బిఎల్వోలు ఓటర్లకు అందజేసే ఎమ్యూనరేషన్ దరఖాస్తులో తమ యొక్క పూర్తి వివరాలను నమోదు చేసుకొని ఓటు హక్కును పొందాలని, అదేవిధంగా రెండు చోట్ల ఉండే ఓటర్లను తొలగించే విధంగా బిఎల్ఓలు కృషి చేయాలని, అదేవిధంగా నకిలీ ఓట్లను సైతం పూర్తిగా డిలీట్ చేసే విధంగా చూడాలని స్థానిక బిఎల్ఓ లకు సూచించారు, నూతనంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరూ ఈ సర్ కార్యక్రమంలో నూతనంగా ఓటు హక్కును పొందే అవకాశం కేంద్ర ఎన్నికల కమిషన్ కల్పించిందని స్థానిక నాయకులను ఉద్దేశించి మాట్లాడారు, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసి ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాకీర్ బలరాం, సిహెచ్ బుచ్చిరెడ్డి, పద్మ, సలీం, రజాక్, దుర్గేష్, కల్పన, నరసింహ, ఆబేద్, లక్ష్మి, సుజాత, లావణ్య, బిఎల్వోలు మరియు కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్ జూన్ 27(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 293 డివిజన్ సూరారంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం ( ఎస్ఐఆర్ ) ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బిఎల్ఓ లో తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని తెలిపారు. ప్రజలు బీఎల్ఓల ద్వారా అందించే ఎన్యుమరేషన్ ఫారమ్ ను సక్రమంగా నింపి సమర్పించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్, సురేందర్ రెడ్డి, రాంచందర్ రెడ్డి, శివ కుమార్, కృష్ణారెడ్డి, మౌనిక, మినాక్షి, అబ్బు, సజ్జు ఖాన్, లక్ష్మణ్, ప్రభకర్ రెడ్డి, నదీమ్ బూత్ లెవెల్ ఆఫీసర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## జూలై 10న ఆర్ బివిఆర్ఆర్ మహిళా కళాశాల స్నాతకోత్సవం

హైదరాబాద్, జూన్ 27: రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 15వ స్నాతకోత్సవం జూలై 10వ తేదీన నారాయణగూడ లోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుతదేవి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ఎం.ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి. మంజుల, వైస్ ప్రిన్సిపల్ సిందూరిలతో కలిసి ప్రిన్సిపాల్ స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన 302 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ను అందజేయనున్నట్లు తెలిపారు. చదువులో అత్యుత్తమంగా రాణించిన 17 మంది విద్యార్థినీలకు స్వర్ణ పతకాలను అందించనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవ వేడుకలకు మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ బి. సుమతి ఐపిఎస్ ముఖ్యఅతిధిగా పాల్గొంటారని, ఓయు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ గౌరవ అతిధిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రధానం చేస్తారని తెలిపారు.

## దుండిగల్ పరిధిలో ఆక్రమణల తొలగింపు

**- భారీ డ్రైవ్ నిర్వహించిన దుండిగల్ సర్కిల్ అధికారులు**



కుత్బుల్లాపూర్ జూన్ 27(వాయిస్ టుడే): నగర శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం మరియు రహదారులను పాదచారులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా దుండిగల్ సర్కిల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మల్లంపేట ఓఆర్ఆర్ (ORR) ఎగ్జిట్ నంబర్ 4a నుండి మల్లంపేట దుండిగల్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి వరకు ఉన్న రహదారి వెంబడి అక్రమంగా నిర్మించిన ఫుడ్ స్టాల్స్ మరియు ఇతర ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టారు.గుర్తించిన ఆక్రమణలు: మల్లంపేట-బాచుపల్లి మార్గంలో సుమారు 1.5 కిలోమీటర్ల మేర రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన దాదాపు 32 అక్రమ నిర్మాణాలను/ఫుడ్ స్టాల్స్‌ను అధికారులు గుర్తించారు.

తొలగించిన ఆక్రమణలు: గుర్తించిన వాటిలో ఇప్పటివరకు 24 ఆక్రమణలను అధికారులు విజయవంతంగా తొలగించారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే తొలగించనున్నట్లు వెల్లడించారు. ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో, దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ ఏసీబీ శ్రీనివాస్ టీపీఎస్ ముఖేష్ సింగ్ మరియు టౌన్ ప్లానింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సిబ్బంది పాల్గొన్నారు.

**అధికారుల హెచ్చరిక:** ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారులపై అక్రమ ఆక్రమణలను సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా రోడ్డు పక్కన వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రోడ్ల ఆక్రమణలకు పాల్పడవద్దని హెచ్చరించారు.



## సిగాచి సంస్మరణ సభ పోస్టర్ ఆవిష్కరణ

**సిగాచి సంస్మరణ సభ పోస్టర్‌ను నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మరియు ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోట సుమలత శ్రీకాంత్ తో కలిసి ఆవిష్కరించిన పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్.**

**జూన్ 30 న జరగనున్న సిగాచి సంస్మరణ సభకు హాజరు కానున్న మాజీ మంత్రి హరీష్ రావు మరియు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి.**

**ధ్రూవా చౌరస్తాలోని సభ ప్రాంగణాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు**

పటాన్ చెరు (వాయిస్ టుడే): సిగాచి పరిశ్రమ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల స్మారకార్థం ఈ నెల 30వ తేదీ ఉదయం 10:00 గంటలకు బీపీఎల్ చౌరస్తా, ఇస్నాపూర్‌లో నిర్వహించనున్న సిగాచి బాధితుల సంస్మరణ సభ పోస్టర్‌ను పటాన్ చెరు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మరియు ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోట సుమలత శ్రీకాంత్ తో కలిసి ఆవిష్కరించిన పటాన్ చేరు మండల ఇంచార్జ్, మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిగాచి ప్రమాదం దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక విషాదకర ఘటనగా నిలిచిపోయిందన్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు నివాళు లర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సిగాచి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించడంతో పాటు, కుటుంబ సభ్యులకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సంస్మరణ సభకు తెలంగాణ మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలియజేయాలనుకునే ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని గడీల శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య,బీఆర్ఎస్వీ నాయకులు మేరాజ్ ఖాన్,ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్స్ మచ్చ కిషోర్ రెడ్డి,బూరిగారి నరేందర్ రెడ్డి,వడ్డే గడ్డ రాజు,గొంగోళ్ల నవీన్ రెడ్డి ,పెలిమెల వెంకటేష్ ,కో ఆప్షన్ సభ్యులు విష్ణు వర్ధన్ రెడ్డి,బంద రాజు ,ఐలాపూర్ మాణిక్ యాదవ్,పాశంమైలారం గ్రామ అధ్యక్షుడు చంద్రశేఖర్ స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.




## నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**బీరంగూడ మారుతి నగర్ కాలనీలో ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం..**

అమీన్పూర్ (వాయిస్ టుడే) : పటాన్చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ, ధ్వజ స్తంభం ప్రతిష్టాపనల కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవ భక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న కాట సుధా

పటాన్ చెరు (వాయిస్ టుడే): పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.



## ఓటును కాపాడుకోని బీజేపీకి బుద్ది చెప్పుదాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

కుత్బుల్లాపూర్ జూన్ 27(వాయిస్ టుడే): ప్రత్యేక సమగ్ర సవరణ( ఎస్ఐఆర్ ) పేరుతో ప్రజల ఓట్లను తొలగించి వారికి అనుకూలమైన వాళ్ళను కాపాడడానికి తీసుకువచ్చిందే సర్ అని కావున ప్రజలందరూ తమ ఓట్లను కోల్పోకుండా సర్ కార్యక్రమంలో పాల్గొని కాపాడుకొని రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కూ ని ఉన్నటువంటి బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడ కొట్టడానికి సిద్ధం కావాలని సర్ లో అందరూ పాల్గొనాలని నినాదంతో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గోడ పత్రికను నేడు షాపూర్ నగర్ లో ఆవిష్కరించడం జరిగింది. అక్రమ చొరబాటు దారు లు ఇతర దేశస్తులు మరణించిన వారి ఓట్లను తొలగిస్తున్నామని ప్రచారంతో తీసుకువచ్చిన సర్ అసలు ఉద్దేశం బిజెపికి వ్యతిరేకులు అయినటువంటి ముస్లిం, క్రైస్తవ, దళిత, బహుజనుల ఓట్లు తొలగించడమే ప్రధాన ఉద్దేశం అని అన్నారు. రాజ్యాంగంలో ఓటు పౌరుని హక్కు అని చెప్తే, ఓటరుగా చేర్చుకోవాల్సింది పోయి గతంలో ఓటర్ అయిన వారినీ కూడా అనుమానాస్పదం గా ఉంచడం, పేర్లలో చిన్న చిన్న తప్పులు ఉన్నప్పటికీ పక్కన పెట్టడం లాంటివి అనేకం జరుగుతున్నాయని దీనివల్ల నష్టపోయేది ఎక్కువగా పనిచేసి బతికే కార్మికులేనని అన్నారు. సర్ పేరుతో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికి వచ్చి ఫారం లు ఎప్పుడు ఇస్తారో తెలియక వారు పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడ్డదని,దీనివల్ల ప్రజలకు ఆర్థిక భారమే కానీ ఎలాంటి ఉపయోగం లేదని, ఒకవేళ వారు ఫారంలో నింప లేక పోతే వారి ఓటు హక్కును తొలగించడం రానున్న రోజుల్లో ఓటు లేదనే కారణంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందని పరిస్థితి ఏర్పడుతుందని ఇదే బిజెపి యొక్క అసలు ఎజెండా అని అన్నారు. ధనవంతులు ఫారంలు సరిగ్గా నింపి ఓటు పొందితే కార్మికులు సరిగ్గా నింపలేరు కాబట్టి కార్మికులకు ఓట్లు తొలగించి ధనవంతులకు ఓట్లుంచి మళ్లీ పూర్వం రోజుల్లో ఉన్నవాడికే ఓటు,లేని వాడికి లేనట్టు తీసుకురావడమే బిజెపి,ఆర్ఎస్ఎస్ యొక్క ప్రధాన లక్ష్యమని, ఇది తెలుసుకొని ప్రజలంతా ఓటును కాపాడుకోని రానున్న ఎన్నికల్లో అదే ఓటుతో బిజెపికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి కే స్వామి, ఏఐటిసి కార్యదర్శి బి శ్రీనివాస్ అధ్యక్షుడు హరినాథ్ రావు ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం నాయకులు వంశీ, కీర్తి, పార్టీ నాయకులు సుంకిరెడ్డి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్‌లో చేరిన భానూరు కాంగ్రెస్ కీలక నాయకులు, వార్డు సభ్యురాలు

**గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి**

**బిఆర్ఎస్ పార్టీ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు .**

**పటాన్చెరు గడ్డ..బిఆర్ఎస్ అడ్డ..**

**శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

పటాన్ చెరు (వాయిస్ టుడే) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వంలో.. మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు నేతృత్వంలో బిఆర్ఎస్ పార్టీ విధానాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ లో చేరుతున్నారని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలం భానూరు గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ప్రవళిక నరేందర్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాగర్, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కుమ్మరి శివయ్య లు తమ అనుచరులతో కలిసి హైదరాబాద్ లో మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో గులాబీ కండువ కప్పుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీకి అడ్డా అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికిని.. అదే పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారంటే ఆ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుందని గుర్తు చేశారు. ప్రజలందరూ తిరిగి కెసిఆర్ పరిపాలన రావాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని ఆయన తెలిపారు. వీరి రాకతో బానూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మరింత బలపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్, శ్రీధర్ చారి, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో మురారి స్మిత్ కోటేష్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తార్నాక డివిజన్‌లో శనివారం ఇంటింటి ఓటరు ధ్రువీకరణ, ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మురారి స్మిత్ కోటేష్ గౌడ్ చురుకుగా పాల్గొన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) అఖిలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన ఫారాలను పంపిణీ చేశారు.అలాగే ఓటర్ల గుర్తింపు వివరాలను ధ్రువీకరిస్తూ, కొత్త ఓటరు నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇతర వివరాల నవీకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మురారి స్మిత్ కోటేష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పాత విధానంలోనే కొనసాగించాలి

**ప్రభుత్వం తక్షణమే బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి**

**బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేసిన గుజ్జ సత్యం**



హైదరాబాద్, జూన్ 27: తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై వినతిపత్రం సమర్పించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గతంలో అమలైన పాత విధానంలోనే కొనసాగిస్తూ, పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేయించేలా రాష్ట్ర ప్రభుత్వంపై బీసీ కమిషన్ ఒత్తిడి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ, ఉన్నత విద్య పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మరియు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల హక్కు అని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వారి విద్యాభవిష్యత్తుకు జీవనాడిగా నిలుస్తోందని అన్నారు. విధాన మార్పులు, నిధుల జాప్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, విద్యాసంస్థలు కూడా తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇంకా విడుదల కాకపోవడంతో విద్యార్థులపై ఫీజుల భారం పెరిగిందని, అనేక కుటుంబాలు అప్పులు చేసి పిల్లల చదువులు కొనసాగించే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. విద్యను ఆర్థిక స్థోమతతో ముడిపెట్టే పరిస్థితి ఏర్పడితే సామాజిక న్యాయ స్ఫూర్తికే విఘాతం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. ఇటీవల ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై తెలంగాణ హైకోర్టు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, పెండింగ్ బకాయిలు, అమలు విధానంపై వివరణ కోరడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోందని గుజ్జ సత్యం పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ప్రజాస్వామ్య పాలనకు తగదన్నారు.

ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలి.

పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిరంతరాయంగా అమలు చేయాలి.

విద్యార్థులపై ముందస్తు ఫీజుల భారం పడకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాలి.

విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా సమయానుకూలంగా నిధులు విడుదల చేయాలి.

బీసీ కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థగా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య తీవ్రతను తీసుకెళ్లి విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని గుజ్జ సత్యం కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## జ్యోతి మోడల్ హై స్కూల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ

నాచారం (వాయిస్ టుడే): వారసిగూడ మేడి బావి జ్యోతి మోడల్ హైస్కూల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులు మేడి బావి నుంచి సీతాఫల్మండి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా చిలకలగూడ ఇన్స్పెక్టర్ రామకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమం పై గురించి ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులు చాక్లెట్లు స్వీట్లు ఇస్తే తీసుకోవద్దని. అందులో మాదకద్రవ్యాలు కలిసే అవకాశం ఉందని సూచించారు. మాదకద్రవ్యాలు తీసుకొని తమ ప్రాణాలు మీదికి తీసుకోవద్దని, సందేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పోలీసులు మరియు జ్యోతి మోడల్ హై స్కూల్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



## కురవి శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం కమిటీ సభ్యులుగా కాసుల మల్లిఖార్జున్

హైదరాబాద్,జూన్ 27: కురవి శ్రీవీరభద్రస్వామి దేవస్థానం కమిటీ సభ్యులుగా కాసుల మల్లిఖార్జున్ రెండో సారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ కె.రవీందర్ రెడ్డి, ఈఓ సత్యనారాయణలు మల్లిఖార్జున్ కు శనివారం నియామకపు పత్రాన్ని అందజేశారు. మల్లిఖార్జున్ కాచిగూడలోని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఆయన నియామకం పట్ల మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు గంప చంద్రమోహన్, కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, విద్యార్థుల విశిష్ట ప్రపంచ రికార్డును అభినందించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 28: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, కరాటే విద్యార్థులు భార్గవసాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియలతో కలిసి 36 సెకన్లలో 26 యాపిల్స్‌ను హ్యాండ్ చాప్స్‌తో బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ విశిష్ట విజయంపై కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, ప్రపంచ రికార్డులో పాల్గొన్న ఆరుగురు విద్యార్థులను అభినందించారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచుతూ క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణను పెంపొందించే సందేశంతో ఈ ప్రపంచ రికార్డు సాధించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కన్నె రమేష్ యాదవ్, జీవీఆర్ కరాటే అకాడమీ బ్లాక్ బెల్ట్స్ అమృత రెడ్డి, గణ సంతోషిణి రెడ్డి తదితరులు డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, ప్రపంచ రికార్డు గ్రహీతలను అభినందించి సత్కరించారు.

## హజ్రత్ సయ్యద్ షాదుల్లాహ్ హుస్సేని షాహీద్ (రహ్మతుల్లాహి అలైహి)

**11న సండల్ మహోత్సవం, జూలై 12న చిరాగా కార్యక్రమాలను**

**హత్నూర మండలం షాదుల్లాహ్ నగర్‌లో 490వ సండల్ ఉరుస్ వేడుకలకు ఆహ్వానం**



హైదరాబాద్,27 జూన్ (వాయిస్ టుడే): రహేమత్‌నగర్:లో మీడియా సమావేశం వారు మాట్లాడుతూ....సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని షాదుల్లాహ్ నగర్‌లో గల హజ్రత్ సయ్యద్ షాదుల్లాహ్ హుస్సేని షాహీద్ (రహ్మతుల్లాహి అలైహి) దర్గా 490వ సండల్ ఉరుస్ మహోత్సవాల నిర్వహణకు సంబంధించిన సమావేశం హైదరాబాద్ రహేమత్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మీర్ అమ్జద్ అలీ షా ఖాద్రీ మాట్లాడుతూ, జూలై 11న సండల్ మహోత్సవం, జూలై 12న చిరాగా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉరుస్ మహోత్సవాల్లో భక్తులు, మురీదులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లియాఖత్ అలీకి ఉరుస్ మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మెహ్రాజ్ అలీ, సయ్యద్ ఇబ్రహీం, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మాత మాత నిమిషాంబికా దేవి వార్షిక బ్రహ్మోత్సవాలు





బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, జూన్ 27 : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి, ఆదిపరాశక్తి, భక్తుల పాలిట కల్పవల్లి, నిమిషములో కోరిన కోర్కెలను తీర్చే కరుణామయి శ్రీ మాతా నిమిషాంబ దేవి అమ్మవారి కృపాకటాక్షాలతో,శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయం, బోడుప్పల్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ద్విదశాబ్ది ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు అమ్మవారు రజితకవచాలంకృత విశేష అలంకరణలో ప్రకాశవంతమైన తేజముతో సర్వదేవత స్వరూపిణిగా, లోకకళ్యాణార్థం ధర్మ పరిరక్షించే తల్లిగా దర్శన భాగ్యం కల్పించారు.ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మూల మంత్ర హోమం, శ్రీచక్రార్చన, నవగ్రహ పాశుపత హోమం, భక్తుల విశేష భాగస్వామ్యంతో సామూహిక చండీ హోమం, అనంతరం నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు వేదఘోషల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి.

హోమాగ్నుల దివ్య తేజస్సు, వేదమంత్రాల నినాదం.

భక్తుల భక్తి పారవశ్యం, అమ్మవారి కరుణాకటాక్షాలు ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక చైతన్యంతో నింపివేశాయి.ఈ పవిత్ర శనివారం నాడు అమ్మవారిని దర్శించి, హోమాలు మరియు పూజల్లో పాల్గొన్న ప్రతి భక్తునికి శనిదోష నివారణ, నవగ్రహ అనుగ్రహం, ఆరోగ్యం, ఐశ్వర్యం, సకల కార్యసిద్ధి, కుటుంబ సౌఖ్యం మరియు అఖండ మంగళం కలగాలని కోరుతూ లోకకళ్యానార్థం ఈ ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్ , రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు, ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, వై. చంద్రశేఖర్, ఎస్. గౌరి శంకర్, డి. నర్సింగ్ రావు, ఎమ్. శ్రీనివాస్ రావు, ఎమ్. సాయి బాబా శ్యామ్, డి. సతీష్, రామగిరి శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, ఎన్. రామకృష్ణ, ఎన్. మోహన్, డి. రామక్రిష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, వై. సత్యనారాయణ ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమకాంత్ శర్మ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలి

## సెప్టెంబర్ 15 నాటికి తొలి విడత పూర్తిచేయాలి

## క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం బిల్లులను వెంటనే సమర్పించాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి




హనుమకొండ,వాయిస్ టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ,వన మహోత్సవం,స్వచ్ఛ భారత్ మిషన్, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎంపీడీవోలు,గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్ అధికారులు,గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మేన శ్రీను ఉపాధి హామీ,వన మహోత్సవం కార్యక్రమాల అమలు పురోగతిని,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల స్థితిగతులను కలెక్టర్‌కు వివరించారు. సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవం సందర్భంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో 8 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని విజయవంతంగా సాధించేందుకు మండలాల వారీగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి గరిష్ఠంగా 90 రోజుల ఉపాధి కల్పించేలా పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) పరిధిలో వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల (IHHL) నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి,క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం బిల్లులను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్న కలెక్టర్,తొలి విడతలో మంజూరైన 3,243 గృహాల నిర్మాణాన్ని సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తైన ప్రతి దశకు సంబంధించిన బిల్లులను ఆలస్యం లేకుండా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బిల్లుల సకాలంలో చెల్లింపులతో నిర్మాణ పనులు మరింత వేగంగా పూర్తవుతాయని చెప్పారు. జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న 2,074 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు పేర్కొంటూ వారి అర్హతలను గెజిటెడ్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో ధృవీకరించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. గ్రామాల్లో గుడిసెల్లో నివసిస్తున్న ఇతర అర్హులను కూడా గుర్తించి పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రూఫ్ రీప్లేస్‌మెంట్ దశలో ఉన్న 615 మంది లబ్ధిదారుల అర్హతలను కూడా గెజిటెడ్ అధికారులతో పరిశీలించాలని పేర్కొన్నారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్లలో స్లాబ్ విస్తీర్ణం 750 చదరపు అడుగులకు మించకుండా పనులు చేపట్టేలా గృహ నిర్మాణ శాఖ ఏఈలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్మాణంలోని అన్ని దశలకు సంబంధించిన వెరిఫికేషన్ పెండింగ్‌లో లేకుండా వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

ప్రజావాణిలో అందుతున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను ప్రజాపాలన పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసి,అర్హతల పరిశీలన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని ఎంపీడీవోలు,మున్సిపల్ కమిషనర్లు,డిప్యూటీ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత,డీఆర్‌డీఓ మేన శ్రీను,అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్,హౌసింగ్ డీఈ రవీందర్,పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్,కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్,ఎంపీడీవోలు,గెజిటెడ్ అధికారులు,గృహ నిర్మాణ శాఖ ఏఈలు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఓయూ న్యాయ కళాశాల విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### జార్జిరెడ్డి పీడీఎస్‌యూ

సికింద్రాబాద్, జూన్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన క్యాంపస్‌లోని న్యాయ కళాశాల విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, కావేరి హాస్టల్ (సి హాస్టల్)లో వసతి కల్పించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డికి జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. సుమంత్ మాట్లాడుతూ న్యాయ కళాశాల విద్యార్థులు మౌలిక సదుపాయాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఉంటున్న ఈ-1 హాస్టల్‌లో మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర వసతులు దయనీయంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను వెంటనే కావేరి (సి) హాస్టల్‌కు తరలించి, వారి సమస్యలను పరిష్కరించాలని యూనివర్సిటీ పరిపాలనను కోరారు. పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ న్యాయ కళాశాల యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని యూనివర్సిటీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి, న్యాయ కళాశాల విద్యార్థి ఎస్. అంజి, పీడీఎస్‌యూ నాయకులు రంజిత్ రెడ్డి, మనోహర్, శ్రీను, అజయ్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్

నాచారం (వాయిస్ టుడే): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా నాచారం సర్కిల్-8 పరిధిలో ఇంటింటి ఓటరు నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న ఓటరు నమోదు, వివరాల ధ్రువీకరణ, దరఖాస్తుల పంపిణీ తదితర కార్యక్రమాలను ఆయన పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఎలాంటి లోపాలు లేకుండా ప్రత్యేక సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో బిల్ కలెక్టర్లు శివరాజ్, ప్రదీప్ , మహేష్ పాల్గొని ఇంటింటి పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మల్లికార్జున్ గౌడ్ అధికారులతో కలిసి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు.



## హుజూర్‌నగర్‌లో ఘనంగా ముగిసిన పీర్ల పండుగ

హుజూర్ నగర్ ,జూన్, 27 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్‌నగర్ పట్టణంలో ఈనెల 16 నుండి 26 వరకు గత 11 రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మొహరం పీర్ల పండుగ ఘనంగా ముగిసింది. హిందూ--ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిర్వహించిన ఈ ఉత్సవాల్లో వివిధ కులాలు, మతాలు, చెందిన ప్రజలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సతీష్ , మున్సిపల్ కౌన్సిలర్ వల్లపు దాసు కృష్ణ గౌడ్ హాజరయ్యారు. వారు పీర్లకు మొక్కులు చెల్లించి తీర్థప్రసాదం స్వీకరించారు. అనంతరం భక్తులు “అసైదుల్లా... అసైదుల్లా..” అంటూ భక్తిశ్రద్ధలతో పీర్లను హుజూర్‌నగర్ పట్టణ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా కమిషనర్ సతీష్ మాట్లాడుతూ, మొహరం పీర్ల పండుగను 11 రోజుల పాటు ఎంతో ఘనంగా నిర్వహించిన ముజావర్ షేక్ సైదా ని అభినందించారు. అలాగే హుజూర్‌నగర్ ప్రజలకు, భక్తులకు మొహరం పీర్ల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముజావర్లు మీరాబాషా, షేక్ నాగుల్ మీరా, షేక్ మోయిన్, సానిటరీ సూపర్వైజర్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## SIRపై ప్రతి ఓటరికి అవగాహన కల్పించడమే లక్ష్యం

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

### రాష్ట్ర హాజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా ఆధ్వర్యంలో SIR పై అవగాహన సదస్సు

### పాల్గొన్న ఎమ్మెల్సీ కోందడ రాం, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి,ప్రముఖులు




హనుమకొండ, వాయిస్ టుడే: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర హాజ్ కమిటీ చైర్మన్,కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా ఆధ్వర్యంలో శనివారం దర్గా కాజీపేటలోని ఆయన నివాసంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా మాజీ ఐఏఎస్‌అధికారి ఆకునూరి మురళి,ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ పి. వినయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రతి ఓటరుకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని,ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా అవసరమైన సవరణలు చేసుకునేలా పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. SIR ప్రక్రియపై అపోహలు,సందేహాలకు తావు లేకుండా ప్రజలకు సరైన సమాచారం చేరవేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులు,రాజకీయ పార్టీలపై ఉందన్నారు. ప్రతి ఇంటికి,ప్రతి ఓటరికి ఈ ప్రక్రియ గురించి వివరించి అవగాహన కల్పించేందుకు తాను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ా×= ప్రక్రియకు సంబంధించిన సమాచారం,మార్గదర్శకాలు,అవసరమైన సహాయం అందించేందుకు బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా ా×= వార్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది వాటిని వెంటనే నివృత్తి చేసి, అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని,ా×= ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ వివరాలను పరిశీలించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

### ఎమ్మెల్సీ కోదండరాం,మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి..

అనంతరం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలని..ఓటరు జాబితా సక్రమంగా ఉండటం ఎన్నికల పారదర్శకతకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ SIR ప్రక్రియలో ప్రజలు నిబంధనలను తెలుసుకుని అవసరమైన పత్రాలను సమర్పిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని వివరించారు. డాక్టర్ పి. వినయ్ కుమార్ కూడా ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అబుబక్కర్,మానస రాంప్రసాద్,సయ్యద్ విజయశ్రీ రజాలీ,జక్కుల రవీందర్,పోతుల శ్రీమాన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వివేక్‌నగర్ బస్తీలో ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ

సికింద్రాబాద్, జూన్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): గాంధీనగర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్-8లో ఉన్న వివేక్‌నగర్ బస్తీలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ డివిజన్ డిప్యూటీ కమిషనర్ పుష్పలత, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ రెడ్డి పాల్గొని ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను అందజేశారు. ఎన్నికల జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, అవసరమైన పత్రాలతో ఫారాలను పూర్తి చేసి సమర్పించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ముచ్చకుర్తి పద్మ, సూపర్వైజర్ సత్యనారాయణ, బీఎల్‌వో అనిత, బీఎల్ఏ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కూకట్‌పల్లి నియోజకవర్గంలో విస్తృతంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ

కూకట్‌పల్లి, జూన్ 27(వాయిస్ టుడే)బీ కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ శనివారం విస్తృతంగా కొనసాగింది. నియోజకవర్గంలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, సర్కిల్ ఉప కమిషనర్ ఆంజనేయులు స్వయంగా పరిశీలించారు.

బాలాజీ నగర్ డివిజన్‌లోని వివేక్‌నగర్ కాలనీలో బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ప్రతి ఓటర్ పేరుతో ముద్రించిన రెండు పత్రాల్లో ఓటరు వివరాలను నమోదు చేసి, ఒక ప్రతిని ఓటర్‌కు అందజేయగా, మరో ప్రతిని అధికారులు సేకరించి కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఈ ప్రక్రియను డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు స్వయంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రతి అర్హుడికి ఓటు నమోదు కావాలని, స్థానికంగా నివసించని వారి పేర్లను గుర్తించి తొలగించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దొంగ ఓట్లు నమోదు కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. అలాగే పార్టీ కార్యకర్తలు ఎస్ఐఆర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని, నిర్లక్ష్యం వహించిన నాయకులపై పార్టీ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియ పూర్తిగా ఖచ్చితత్వంతో నిర్వహిస్తున్నామని, ఎవరి ఓటు లేకపోయినా లేదా కొత్తగా ఓటరుగా నమోదు కావాలన్నా సంబంధిత అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బూత్ నెం. 219కు బీఎల్‌వో మౌనిక, బీఎల్ఏ శ్రీకాంత్ ముదిరాజ్, బూత్ నెం. 220కు బీఎల్‌వో లక్ష్మీ, బీఎల్ఏ ఎండీ. జంగీర్ పాల్గొన్నారు.

అలాగే బాలాజీ నగర్ డివిజన్ వివేక్‌నగర్ కాలనీకి చెందిన పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజపుత్, మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సునీల్ కుమార్, పిడికిటి గోపాల్ చౌదరి, రంగమోహన్, సుధా తదితరులు పాల్గొన్నారు.

## మన లోకేష్ పర్యటనను కూటమి నాయకులు

శ్రీకాళహస్తి,జూన్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్ర మంత్రివర్యులు ప్రియతమ నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా మన శ్రీకాళహస్తి నియోజకవర్గానికి విచ్చేస్తుండడం నాకు మరియు మన కూటమి శ్రేణులందరికీ ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని ఇస్తోంది.జూలై 1వ తేదీన మన నియోజకవర్గంలో నిర్వహించబోయే భారీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి లోకేష్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా, అట్టహాసంగా నిర్వహించే ఏర్పాట్లలో భాగంగా మన నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో సభా ప్రాంగణాలను కూటమి ముఖ్య నాయకులు, అధికారుల బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది సభకు విచ్చేసే కార్యకర్తలకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించడమైనది. నియోజకవర్గ ప్రగతికి సరికొత్త ఊపునివ్వబోతున్న మన లోకేష్ పర్యటనను కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కదిలివచ్చి బ్రహ్మాండంగా విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాను.



వాయిస్
హైదరాబాద్
ఆదివారం 28 జూన్ 2026

# మాజీ సీఎం జగన్‌గారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే వైఎస్సార్‌సీపీ మహిళలు చెప్పులతో బుద్ధి చెబుతారు

## అనగాని రవి తీవ్ర హెచ్చరిక

కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని ఉద్దేశించి కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని గన్నవరం ఎంపీపీ, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగాని రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, మాజీ ముఖ్యమంత్రిని 'వాడు, వీడు, నా కొడక' అంటూ ఏకవచనంతో దుర్భాషలాడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. పంతం నానాజీ తక్షణమే వైఎస్ జగన్‌గారికి, రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాగే నోరు పారేసుకుంటే వైఎస్సార్‌సీపీ మహిళా సింహాలు చెప్పులతో బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.



### ఎమ్మెల్యేనా.. మాఫియా డానా?

'తాను ఒక ప్రజాప్రతినిధిని అనే విచక్షణ మరిచి పంతం నానాజీ ఒక మాఫియా డాన్‌లా వ్యవహరిస్తున్నాడన్నారు. నానాజీ చరిత్ర అంతా అరాచకాలు, దౌర్జన్యాలతో నిండిపోయిందన్నారు.గతంలో ఒక దళిత వైద్యుడైన ఉమామహేశ్వరరావుపై 'ఏరా లం.. కొడకా.. చంపేస్తా' అంటూ రౌడీలతో కలిసి దాడికి తెగబడింది నిజం కాదా? సొంత పార్టీకి చెందిన ఆకుల బాలరాజు రూ. 10 లక్షల లంచం ఇవ్వలేదని ఆయన షాపును కూల్చేయించిన చరిత్ర నానాజీది. కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఎవరి హస్తం ఉందో అందరికీ తెలుసు.'

### క్రిమినల్స్‌ను పక్కన పెట్టుకుని నీతులు చెప్తారా, పవన్ కళ్యాణ్ గారూ?

సమాజంలో క్రిమినల్స్ తాట తీస్తానంటూ ప్రగల్భాలు పలికే పవన్ కళ్యాణ్, తన పక్కనే ఉన్న క్రిమినల్స్ జాబితాను ఒకసారి చూసుకోవాలని అనగాని రవి ఎద్దేవా చేశారు. జనసేన ఎమ్మెల్యేలు పంతం నానాజీ పై11 కేసులు ఉన్నాయి. బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, కందుల దుర్గేశ్, బత్తుల రామకృష్ణ, అరవ శ్రీధర్ లాంటి అనేక మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. మహిళకు ఐదుసార్లు అబార్షన్ చేయించి వేధించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై పవన్ కళ్యాణ్ ఏం చర్యలు తీసుకున్నారు? తిరుపతిలో మహిళల జీవితాలతో ఆడుకుంటున్న కామ కిరణ్ ఆగడాలను ఎందుకు అరికట్టలేదు? పంతం నానాజీ చేసే దోపిడీలు, వసూళ్లలో పవన్ కళ్యాణ్‌కు ఏమైనా వాటాలు వెళు_తున్నాయా? అందుకే ఆయన అరాచకాలపై స్పందించడం లేదా? అని ప్రశ్నించారు.

### టీడీపీ లేకపోతే పవన్ కళ్యాణ్‌కు ఉనికి లేదు

జనసేన పార్టీకి సొంతంగా నిలబడే సత్తా లేదని, టీడీపీ భిక్ష వల్లే ఆ పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారని రవి విమర్శించారు. 'టీడీపీ నుంచి అభ్యర్థులు అరువు వస్తే తప్ప జనసేనకు క్యాండిడేట్లు దొరకని పరిస్థితి. టీడీపీ లేకపోతే తాను కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేననే భయం పవన్ కళ్యాణ్‌ను వెంటాడుతోంది. అందుకే టీడీపీ నాయకులు జనసేన కార్యకర్తలను కుక్కలను కొట్టినట్టు కొడుతున్నా, అవమానిస్తున్నా పవన్ నోరెత్తడం లేదు. మరో 15 ఏళ్లు టీడీపీకి ఊడిగం చేయాలని కార్యకర్తలను మానసికంగా బెదిరిస్తున్నారు.'

### కాపు సామాజికవర్గ నేత హత్యపై మౌనమెందుకు?

కాపు సామాజికవర్గానికి చెందిన గాదె సాయికృష్ణను పోలీసులు అత్యంత దారుణంగా చంపి, దహనం చేసి, కనీసం బూడిద కూడా ఇవ్వకుండా మాయం చేస్తే.. సొంత సామాజికవర్గం అని చెప్పుకునే పవన్ కళ్యాణ్ 40 రోజులుగా ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. ఈ ఘోరాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బయటపెట్టకపోతే ప్రపంచానికి తెలిసేదా అని రవి ఆవేదన వ్యక్తం చేశారు

కేవలం 6 శాతం ఓట్ల బలంతో, టీడీపీ అండ చూసుకుని జనసేన నేతలు పిచ్చిగా రెచ్చిపోతే సహించేది లేదని.. 40 శాతం ఓటు బ్యాంక్ కలిగిన వైఎస్సార్‌సీపీ సింహాలు తిరగబడితే జనసేన నేతలు తలదాచుకోవడానికి కూడా చోటుండదని అనగాని రవి హెచ్చరించారు. ఇకనైనా పంతం నానాజీ నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాలు మెరుగుపర్చాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి డిమాండ్

మాడుగుల పల్లి జూన్ 27(వాయిస్ టుడే): మాడ్గులపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్సీ) లలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి కోరారు.శనివారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సీపీఎం పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాడ్గులపల్లి మండలం ఏర్పడి 10 సంవత్సరాలు అవుతున్నప్పటికి నేటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయకపోవడం బాధాకరం అన్నారు.మండలంలోని ప్రతి ఉప కేంద్రానికి స్వంత భవనాలు నిర్మించాలని అన్నారు.తోపుచర్ల,పాములపహాడ్, ఆగామోత్కూర్,ఇందుగుల ఉప కేంద్రాలలో అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు.మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు ఉప కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు.ఆగామోత్కూర్ గ్రామంలో గత 4 సంవత్సరాల క్రితం పల్లె దావఖానా మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించినప్పటికీ నేటికీ పూర్తి కాలేదన్నారు.ఉన్నత వైద్యాధికారులు వెంటనే ఆ భవనాన్ని పరిశీలించి నిర్మాణం పూర్తి అయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా అన్ని ఉప కేంద్రాలలో కరెంటు,టాయిలెట్స్,మంచి నీరు,తదితర సమస్యలు లేకుండా అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.పాములపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్, ఇతర సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు మరియు ఆసుపత్రి మౌళిక సదుపాయాలు గురించి తెలుసుకున్నారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.వారి వెంట సీపీఎం పార్టీ మండల కార్యదర్శి రొండి శ్రినివాస్,మండల నాయకులు దేవి రెడ్డి అశోక్ రెడ్డీ,పుల్లెంల శ్రీఖర్,పతాని శ్రీను,తంగెళ్ళ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్వీ

### బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్ కుమార్



వేములవాడ (వాయిస్ టుడే ): వేములవాడ పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, అలాంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రూ.25 వేల నుంచి రూ.1 లక్ష వరకు ఫీజులు వసూలు చేయడమే కాకుండా, పాఠశాలల్లోనే పుస్తకాలను విక్రయిస్తూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు.షిఫ్టింగ్‌కు సంబంధించి అనుమతులు లేకుండానే కొన్ని పాఠశాలలు కొత్త భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ అంశంపై ఫిర్యాదు చేసేందుకు రెండుసార్లు మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) కార్యాలయానికి వెళ్లినా అధికారి అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకుడు లింగం రాకేష్ పాల్గొన్నారు.

## సీత్యాతండ అంగన్వాడీటీచర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్



మాడ్గులపల్లి జూన్ 27(వాయిస్ టుడే): ఐ సి డి ఎస్ దామరచర్ల ప్రాజెక్టు మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ సెక్టార్ పరిధిలోని త్యా తండ అంగన్వాడీ టీచర్ పోస్టు భర్తీకి అధికారిక నోటిఫికేషన్ విడుదలైనట్లు సెక్టర్ సూపర్వైజర్ నాగరాణి తెలిపారు.ఈ మేరకు శనివారం సీత్యాతండ గ్రామ పంచాయతీ సర్పంచ్ రాయరపు ఉమారాణి వెంకన్న ను కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నోటిఫికేషన్ వివరాలకు సంబందించిన నోటీసును అతికించడం జరిగిందన్నారు. అంగన్వాడీ టీచర్ నియామక ప్రక్రియలో భాగంగా సీత్యాతండ గ్రామ పంచాయతీ లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టును భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ రాయరపు ఉమారాణి మాట్లాడుతూగ్రామపంచాయతీ లో అర్హత కలిగిన ఎస్టీ స్థానిక మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిఆమె కోరారు , నోటిఫికేషన్ కు సంబందించిన సమగ్రమైన సమాచారం కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం,ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని సర్పంచ్ రాయరపు.ఉమారాణి, సూపర్ వైజర్ నాగరాణి,లు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వడ్డే సరిత, వంకుడోతు గీతా, గ్రామ పంచాయతీ జిపిఎ సైదానాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు భూమిపూజ

మహబూబ్నగర్ జిల్లా జూన్ 27 (వాయిస్ టుడే): జడ్చర్ల /నవాబుపేట మండలంలోని పోమాల గ్రామంలో లబ్ధిదారుడు ఆలూరి గంగారాం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కవిత నరేష్ హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కవిత నరేష్ మాట్లాడుతూ..ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని,లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు నాణ్యతతో,నిర్ణీత గడువులోపు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు రామచంద్రయ్య, ఉప సర్పంచ్ ఆంజనేయులు, పార్టీ కార్యకర్తలు సుధాకర్, యాదయ్య, శ్రీశైలం,ప్రేమ్ చంద్,ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



## సీఎం పర్యటన నేపథ్యంలో నల్లగొండలో ట్రాఫిక్ ఆంక్షలు

### ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలి – జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ జూన్ 27 వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఎన్.జి. కళాశాల మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభ నేపథ్యంలో పట్టణంలో విస్తృతంగా ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణతో పాటు సభకు వచ్చే ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.సభకు హాజరయ్యే ప్రజల కోసం ప్రత్యేక మార్గాలు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మిర్యాలగూడ, తిప్పర్తి వైపు నుంచి వచ్చే వారు మిర్యాలగూడ--తిప్పర్తి--దుప్పలపల్లి, పానగల్ మార్గం లేదా నకరేకల్--పానగల్--పుల్లారెడ్డి మార్గం ద్వారా సభా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు.వీరి వాహనాల పార్కింగ్ కోసం కళాభారతి,మేకల అభినయ్ స్టేడియం, ఆర్యసమాజ్ ప్రాంగణం, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు.సాగర్, దేవరకొండ, కనగల్, మునుగోడు ప్రాంతాల నుంచి వచ్చే వారు రూరల్ పోలీస్ స్టేషన్ మీదుగా మునుగోడు బైపాస్ ద్వారా పట్టణంలోకి ప్రవేశించి, రాఖీల్స్ కాలనీ, వి.టి. కాలనీ, ఎల్.వి. పెట్రోల్ బంక్, ఆర్.ఆర్.ఆర్., రాఘవేంద్ర కాలనీ, రవీందర్ నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలను వినియోగించాలని సూచించారు.ద్విచక్ర వాహనాల కోసం పోలీస్ పరేడ్ గ్రౌండ్, బీట్ మార్కెట్ వద్ద ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించారు.సభా ప్రాంగణానికి వెళ్లే డి.టి.సి మహిళా ప్రాంగణం, డీఈఓ కార్యాలయం, క్లాక్ టవర్ నుంచి ఎన్.జి. కళాశాల వరకు ట్రాఫిక్ ఆంక్షలు పూర్తిగా అమల్లో ఉంటాయని తెలిపారు.ఈ మార్గాల్లో సాధారణ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తామని పేర్కొన్నారు.పానగల్ పరిసర ప్రాంతాల ప్రజలు రామాలయం--బస్టాండ్ మార్గాన్ని ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవాలని, హైదరాబాద్ రోడ్డు పరిసర ప్రాంత ప్రజలు వివేకానంద విగ్రహం నుంచి ఇతర మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. వివేకానంద విగ్రహం నుంచి ఎన్.జి. కళాశాల వరకు సాధారణ వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.ట్రాఫిక్ పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి పోలీసు శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ విజ్ఞప్తి చేశారు.ప్రజల సహకారంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



## మాడ్గులపల్లి మండలంలో మమ్మురంగా ఎస్ఐఆర్

### ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న బీఎల్‌వోలు

మాడ్గులపల్లి జూన్ 27(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలసంఘంప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పక్రియ మాడ్గులపల్లి మండల వ్యాప్తంగామమ్ము రంగాకొనసాగుతుంది .ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాను పూర్తిగా ప్రక్షాళన చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికిఓటుహక్కుకల్పించడం,అనర్హుల పేర్లను తొలగిం చడమేలక్ష్యంగాఈకార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఓటరు జాబితాలో ఓటర్ల పేరు, చిరునామా, వయస్సు, కుటుంబ సభ్యుల వివరాలు, మరణించిన ,ఇతరప్రాంతాలకు వలస వెళ్లినవారి సమగ్ర సమాచారాన్నినమోదు చేస్తున్నారు.అదేవిధంగా కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. మండలం లోని తోపుచర్ల గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పక్రియకార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి మాడ్గులపల్లి మండలం షోషల్ మీడియా అధ్యక్షులు షేక్ మౌలాలి పాల్గొని మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి ప్రజలందరు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో తప్పులుఉంటేవాటినిసరిచేసుకునేందుకు, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల మార్పులు, చిరునామా మార్పులు వంటి అంశాలను ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా పరిష్కరించనున్నట్లు అయన తెలిపారు.ప్రజలు తమ ఆధార్, గుర్తింపు కార్డులు తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంతవిలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితా లోఉండేలాచర్యలు తీసుకోవాలని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తోపుచర్ల 13 వ పోలింగ్ కేంద్రం బూత్ లెవల్ ఆఫీసర్ బొప్పని శోభ,ఓటర్లు షేక్ ఖాసింబీ, షేక్ హుస్సేన్ బీ, షేక్ జారీనాబేగం, షేక్ హసీనా, షేక్ ఫాజియా,షేక్ రేష్మా,తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరులో 'జల మహోత్సవం... స్వచ్ఛమైన బోరు నీరే తాగాలని అవగాహన




ఝరాసంగం జూన్ 27 (వాయిస్ టుడే): ఝరాసంగం మండలం కొల్లూరు గ్రామంలో గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో, మిషన్ భగీరథ ఏఈ మౌనిక సమక్షంలో 'జల మహోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ, మినరల్ వాటర్ కంటే గ్రామంలోని బోర్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన నీటినే వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా బోరు నీరు, మార్కెట్‌లో లభించే మినరల్ వాటర్‌పై ుణా/నాణ్యత పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాలను ప్రజలకు వివరించారు. పరీక్షల్లో బోరు నీరే ఆరోగ్యానికి సురక్షితమైనదిగా నిర్ధారణ కావడంతో గ్రామ ప్రజలు బోరు నీటినే వినియోగించాలని అధికారులు కోరారు. కొల్లూరు గ్రామ సర్పంచ్ చింతలగట్టు శివరాజ్ మాట్లాడుతూ, ప్రకృతిసిద్ధమైన స్వచ్ఛమైన నీటిని తాగడం వల్ల అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలను అన్ని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ మౌనిక, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు.డప్పూర్ సంగమేష్, గ్రామ పెద్దలు, గ్రామ పాలకవర్గ సభ్యులు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 5 సంవత్సరా లోపు చిన్నపిల్లలు పోలియో తప్పనిసరి : డాక్టర్ శ్రావణ్ కుమార్



మహబూబ్నగర్ జిల్లా జూన్ 27 (వాయిస్ టుడే) : (జడ్చర్ల )నవాబుపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నేడు ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు.దీనిపై శనివారం మండల కేంద్రంలో డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ 5ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని,మండల వ్యాప్తంగా 51పోలియో బూత్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, మొత్తం 8,738మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్,సుధాకర్,శరభలింగం,శ్రీనివాస్,ఏఎన్ఎంలు,ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## 50వ డివిజన్‌లో ఎస్.ఐ.ఆర్‌పై అవగాహన

### ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ చేసిన కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు

కరీంనగర్,జూన్ 27(వాయిస్ టుడే): నగర పాలక సంస్థ 50వ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్ నంబర్ 170లో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై ప్రజలకు,ఓటర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్.ఐ.ఆర్ ఆవశ్యకతను, దాని ప్రయోజనాలను ప్రజలకు వివరంగా తెలియజేశారు. ఎస్.ఐ.ఆర్ పై అవగాహన ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ కార్యక్రమం డివిజన్ వ్యాప్తంగా జరుగుతుందని, డివిజన్ ప్రజలు ఎలాంటి అపోహలు ఆందోళనకు గురికావద్దని తెలిపారు. డివిజన్ ప్రజలకు ఓటుకు సంబంధించిన విషయంలో సమస్యలు తలెత్తుతే తనను సంప్రదించ వచ్చున్నారు.170 పోలింగ్ బూత్ లో బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ) అనిత, బి ఎల్ ఓ2 వెంకటస్వామి, రాజేందర్ రావులతో కలిసి కార్పొరేటర్ ప్రవీణ్ రావు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ చేశారు.ఈ ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# రాజన్న ఆలయ విస్తరణ పనులు వేగం

**భక్తులకు మెరుగైన దర్శనం.. వసతులు కల్పించేలా ముందుకు**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**రాజన్న ఆలయం, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**





వేములవాడ/రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ లో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,దేవాదాయ శాఖ ,పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ , జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు.. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనుల వద్ద ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని వివరించారు. ఇప్పటి వరకు 35 శాతం పూర్తి అయ్యాయని తెలిపారు.శృంగేరి పీఠాధిపతి సూచనలు, ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు.

ఆలయ విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు.. ఆలయ విస్తరణ అభివృద్ధిలో భాగంగా ఒక్కో పనికి ఒక్కో గడువు పెట్టుకొని ముందుకు పోతున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి, మంత్రుల సహకారంతో,శృంగేరి పీఠం వారి సూచనలకు అనుగుణంగా ముందుకు పోతున్నామన్నారు. ప్రస్తుతం అనిమిటి మండపంలో భాగంగా అద్దాల మండపం,బ్రహ్మణ సత్రం, నిత్య అన్నదాన సత్రం,ఇతర పనులు వేగంగా జరుగుతున్నాయని, మరో 1000 సంవత్సరాల పాటు ఉండేలా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నమని, త్వరలోనే పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన దర్శనం కల్పిస్తామన్నారు.. వేములవాడ పట్టణంతో పాటు రాజన్న ఆలయాన్ని సమపాళ్లలో అభివృద్ధి చేస్తామని తెలిపారు..47 కోట్లతో రోడ్డు విస్తరణ, ఆరు కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు..

**రాజన్న హోలిడే అభివృద్ధితో పాటు 20 కోట్లతో బద్ధీ**

పోచమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.. నాంపల్లి గుట్ట ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని అందులో భాగంగా ఇప్పటికే నాంపల్లి 10 లక్షలతో ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో నాంపల్లి గుట్టను పర్యాటక రంగంలో తీర్చి దిద్దుతామని తెలిపారు..ఆద్యాత్మిక వాతావరణంలో సకల సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని ,భక్తుల మనోభావాలు, ఆగమ శాస్త్ర అనుగుణంగా రాజన్న ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. అంతర ఆలయం అలాగే ఉంటుందని,రాజన్న ఆలయం చెరువు కట్టపై ఉండటం వలన ఆలయాన్ని అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి అభివృద్ధి చేస్తున్నామని, శిలలతో నిర్మాణం ఉంటుందని తెలిపారు. సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయ పనులు పరిశీలించడం జరిగిందన్నారు..వచ్చే ఏడాది ఆలయ విస్తరణ పనులు పూర్తి చేసి భక్తులకు స్వామి వారి దర్శనం కలిగేలా ఏర్పాటు చేస్తున్నాం అన్నారు..రాష్ట్ర ప్రభుత్వం, విప్ సూచనలు అబివృద్ధి చేస్తున్నామన్నారు. ఇంకా అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం భక్తులకు భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలు దర్శనాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# కుడా భూములపై చర్చకు సిద్ధం.. దమ్ముంటే రావాలి

**బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుడా నిధుల్లో రూ.45 కోట్ల దుర్వినియోగం**

**కాళోజీ కళాక్షేత్రం కాంట్రాక్టర్ అవినీతిపై కేసు నమోదు**

**డీసీసీ అధ్యక్షులు,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**



హనుమకొండ,వాయిస్ టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం మరియు కుడాపై చేసిన ఆరోపణల విషయంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ నేరుగా చర్చకు రావాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరియు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కుడా భూములపై మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని,దమ్ముంటే గజం రూ.75 వేల చొప్పున ఆ భూములను ఆయనే కొనుగోలు చేయాలని సవాల్ విసిరారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కుడాకు 225 ఎకరాల భూములను కేటాయించి సంస్థకు రూ.500 కోట్ల ఆదాయ వనరులను చూపించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కుడా భూములను నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుడా నిధుల్లో రూ.45 కోట్ల దుర్వినియోగం..

వచ్చే ఎన్నికల్లో వినయ్ భాస్కర్‌కు బీఆర్ఎస్ పార్టీ నుంచే టికెట్ దక్కదని..ఆయన రాజకీయ ప్రస్థానం ముగిసిపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై,తమ నాయకత్వంపై బీఆర్ఎస్ శ్రేణులు చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకే కుడా నిధుల్లో రూ.45 కోట్ల దుర్వినియోగం జరిగిందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆరోపించారు. నగర పరిధిలోని ఏషియన్ మాల్ సమీప ప్రాంతాలు,శాయంపేట, దీనదయాళ్ నగర్,రెడ్డిపురంలో ఉన్న వందల కోట్ల విలువైన కుడా భూములను కాంగ్రెస్ ప్రభుత్వమే కాపాడిందని స్పష్టం చేశారు. నగర అభివృద్ధి కోసం పెట్టుబడిదారులను ఆహ్వానిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ హనుమకొండ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అలాగే కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంలో జరిగిన కాంట్రాక్టర్ అవినీతిపై ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుడా భూములు గజం రూ.1.50 లక్షలకు అమ్ముడుపోయినట్లు బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారానికి ఆధారాలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. ఎలాంటి రాజకీయాలు లేకుండా పార్టీలకు అతీతంగా అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పంపిణీ చేస్తున్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు చిల్లర విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పాలనను చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి ఆరోపణలకు పాల్పడుతున్నారని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పేర్కొన్నారు.

# భద్రకాళి చెరువు పనులను వెంటనే పూర్తి చేయాలి

**ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలో**

**వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలి**

**కేటీఆర్ పర్యటనతో గులాబీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం**

**మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్**



హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: వరంగల్ నగర ప్రజల జీవనాడిగా భావించే భద్రకాళి చెరువు పూడికతీత పనులను ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భద్రకాళి చెరువు పూడికతీత పనులు ప్రారంభమై నెలలు గడిచినా ఇప్పటికీ పూర్తి కాకపోవడం విచారకరమని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం,వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం,స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. గత ఏడాది భారీ వర్షాలు,వరదల కారణంగా పనులు నిలిచిపోయాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వర్షాకాలం ముగిసిన తర్వాత కూడా పనులను వేగవంతం చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పూడిక మట్టిని తరలించడంలో సాంకేతిక సమస్యలు, బిల్లుల చెల్లింపుల జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులను ఆలస్యం చేస్తున్నారని పేర్కొన్నారు.

**వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలి.**

గత ఏడాది భద్రకాళి మత్తడి గేట్లు బిగించకపోవడం 100 ఫీట్ల రోడ్డు అండర్ డ్రెయిన్ గేట్లు ఎత్తకపోవడం వల్ల నగరంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాదైనా ముందస్తు చర్యలు చేపట్టి నగరం మునిగిపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భద్రకాళి చెరువులో వరుసగా చోటుచేసుకుంటున్న మునక ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని వినయ్ భాస్కర్ అన్నారు. ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారని,తాజాగా మరో యువకుడు మృతి చెందడం విషాదకరమని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయని విమర్శించారు.

**కేటీఆర్ పర్యటనతో గులాబీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం..**

ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ ఈ నెల 29న కల్వకుంట్ల తారక రామారావు వరంగల్ పర్యటన గులాబీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతుందని అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 24 డివిజన్ల నుంచి కార్యకర్తలు భారీగా తరలివస్తారని..వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు దిడ్డి కుమారస్వామి,రమేష్ బాబు,మాజీ కార్పొరేటర్ ఉడతల సారంగపాణి,నాయకులు పులి రజనీకాంత్, నయీమొద్దీన్, మోడం ప్రవీణ్, నర్సింహారావు, గౌస్ ఖాన్,మూటిక రాజు యాదవ్, మనోహర్, సందీప్, వాసు,రమేష్,సంతోష్,రాజు పటేల్, సుమిత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## విజయ సంకల్పయాత్ర పోస్టర్లు ఆవిష్కరణ

**డాక్టర్ కె.వి కృష్ణారావు**

ఖమ్మం , జూన్ 27 ( వాయిస్ టుడే ): ఖమ్మం మయూరి సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప యాత్ర ను కేకే కమిటీని ఏర్పాటు చేసినందుకు గాను ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి మరియు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ.... తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిష్టర్ట్ సంఘం ఆధ్వర్యంలో 101 కార్లతో జోగులాంబ పుణ్య క్షేత్రానికి తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది . తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిష్టర్ట్ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పసుపులేటి నాసరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిష్టర్ట్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి కృష్ణారావు మాట్లాడుతూ ఈనెల 29వ తారీకు సోమవారం నాడు చేపట్టిన సంకల్ప యాత్రకు తెలంగాణ నలుమూల నుంచి కార్లతో బయలుదేరి తెలంగాణ ఉద్యమకారులందరూ పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయవలసిందిగా కోరారు . ఈ కార్యక్రమంలో పగడాల నరేందర్ , బచ్చల పద్మాచారి , లింగనబోయిన సతీశ్ , కేలోత్ రవిచంద్ర చౌహాన్ , మేలవెల్లి వెంకటేశ్వరరావు , రెడ్డే బోయిన వరలక్ష్మి , గాజుల రవి కుమార్ , భుక్య శ్రీనివాస్ నాయక్ , వసీం ఖాన్ , బురాన్ , ఆసిఫ్ , అల్లిక సంతోష్ యాదవ్ , దొడ్డ శ్రీనివాస్ రెడ్డి , ఉపేందర్ , వేముల సతీష్ , స్వరూప రెడ్డి , కమలమ్మ , ధనలక్ష్మి , యక లక్మి పాల్గొన్నారు.



## ప్రభుత్వ నిర్లక్ష్యంతో గాయపడిన మహిళ

**పరామర్శించిన దాస్యం వినయ్ భాస్కర్.. ఆర్థిక సాయం అందజేత**

**డ్రెయిన్ పనుల్లో నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం**

**మాజీ చీఫ్ విప్,బీఆర్ఎస్ అధ్యక్షులు వినయ్ భాస్కర్**

హనుమకొండ జిల్లా, (వాయిస్ టుడే) : డ్రెయిన్ నిర్మాణ పనుల్లో ప్రభుత్వం,కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా గాయపడిన విమలను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ శనివారం పరామర్శించారు. ఇటీవల హనుమకొండలోని బాలసముద్రం లోని ప్రెస్ క్లబ్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్డును తవ్వి అక్కడ ఎటువంటి భద్రతా చర్యలు లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని వినయ్ భాస్కర్ విమర్శించారు. ఈ నిర్లక్ష్యం కారణంగా శ్రీచక్ర ఆస్పత్రిలో పనిచేస్తున్న విమల ప్రమాదవశాత్తు గోతిలో పడిపోవడంతో తీవ్రంగా గాయపడి నడుము విరిగిందని తెలిపారు.

**హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదం..**

బాధితురాలు విమల మాట్లాడుతూ ప్రభుత్వం మరియు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే తాను గాయపడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో ఎటువంటి సూచికలు,బారికేడ్లు ఏర్పాటు చేయలేదని తెలిపారు. తాను మాత్రమే కాకుండా మరో ఇద్దరు కూడా శుక్రవారం గాయపడినట్లు వెల్లడించారు. “మా ప్రాణాలకు ప్రమాదం ఏర్పడిన తర్వాతే అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు” అని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ బాధితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పనులు జరుగుతున్న ప్రాంతాల్లో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ మాజీ కో-ఆర్డినేటర్ పులి రజనీకాంత్,నాయకులు నర్సింహారావు,తక్కళ్లపల్లి వినీల్ రావు,విజయ్,గౌస్ ఖాన్,మహేష్,శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొన్నారు.



## వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాం

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్,జూన్ 27(వాయిస్ టుడే): రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి, రోడ్లపైకి వర్షపు నీరు చేరకుండా ఉండేందుకు అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.డ్రైనేజీల పూడికతీత పనులను పరిశీలించిన సందర్భంగా సిల్ట్ కంటే భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నాయని మేయర్ ఆందోళన వ్యక్తం చేశారు.నగరంలో ఇంటింటికీ స్వచ్ఛ ఆటోలుద్వారా చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ,కొందరు నిర్లక్ష్యంగా ప్లాస్టిక్ కవర్లు,చెత్తను డ్రైనేజీల్లో వేయడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి,ప్రజారోగ్యానికి హానికరమని,క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. అందువల్ల నగర ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి,ప్లాస్టిక్ రహిత కరీంనగర్ లక్ష్య సాధనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.చెత్త సేకరణలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే స్థానిక కార్పొరేటర్ల దృష్టికి తీసుకువస్తే వెంటనే స్వచ్ఛ ఆటోలను పంపించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.నగర పరిశుభ్రతను కాపాడేందుకు రోడ్లపై, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేదా ఇతర చెత్తను వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నగర ప్రజలకు మేయర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండారి వేణు,మాజీ కార్పొరేటర్ జితేందర్,సాదవేని శ్రీనివాస్,అనిల్ పాల్గొన్నారు.

వాయిస్

హైదరాబాద్
ఆదివారం 28 జూన్ 2026

## ఓటర్ల జాబితా ప్రక్షాళనలో బీజేపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరించాలి**

**క్షేత్రస్థాయిలో ఓటరు నమోదుపై దృష్టి సారించండి**

**శ్రేణులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి దిశా నిర్దేశం**



కరీంనగర్,జూన్ 27(వాయిస్ టుడే): ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటూ అత్యంత విలువైనదని,భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ ) ప్రక్రియలో బిజెపి శ్రేణులు అప్రమత్తంగా ఉండి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి పిలుపునిచ్చారు.కరీంనగర్ జిల్లా లోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పరిశీలకునిగా ఆంటోనీ రెడ్డి హాజరై సర్ నిర్వహణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి,ఓటరు నమోదు, చిరునామా మార్పులు తప్పుల సవరణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు.18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ,యువకుడు ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని, ప్రజాస్వామ్య బలోపేతంలో యువత భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమన్నారు.బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ) ఇంటింటికి వచ్చి చేసే వెరిఫికేషన్ ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు నిరంతరం నిఘా ఉంచాలని,అర్హులైన వారెవరూ జాబితా నుండి తొలగించబడకుండా చూడాలని కోరారు.ఓటరు జాబితాలో లోపాలు లేకుండా చూడటం పార్టీ గెలుపులో మొదటి మెట్టు అని,బూత్ స్థాయి కమిటీలు ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూనే, ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ఒక బాధ్యతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆంటోనీ రెడ్డి సూచించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడటం ద్వారానే ప్రజాస్వామ్యయుతమైన ఎన్నికలకు పునాది వేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు,జిల్లా కార్యదర్శి నరసింహ రాజు,మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుర్రాల నిర్మల రెడ్డి,ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, హుజురాబాద్ నియోజకవర్గ మండల అధ్యక్షులు తూర్పాటి రాజు,కొండల్ రెడ్డి,కొలగాని రాజు,బైరెడ్డి రమణారెడ్డి,రమేష్, బత్తిని నరేష్,ర్యాకం శ్రీనివాస్,వొడ్నాల విజయ్,మానకొండూరు, చొప్పదండి,కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## ఆంజనేయ విగ్రహ దొంగలను కటినంగా శిక్షించాలి

**మాజీ మంత్రి గంగుల కమలాకర్**

**ఆంజనేయ విగ్రహం పున: ప్రతిష్టాపన**

కరీంనగర్,జూన్ 27(వాయిస్ టుడే): ఆంజనేయ స్వామి విగ్రహాన్ని దొంగిలించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పోలీసులను కోరారు. నగరంలోని ఐదవ డివిజన్ బొమ్మకల్ శివారులోని రాజరాజేశ్వరి కాలనీలో కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హనుమాన్ విగ్రహాన్ని ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి దుబ్బపల్లిలో వదిలివేసి వెళ్లారనీ విషయం తెలుసుకున్న కాలనీవాసులు ఆ విగ్రహాన్ని కాలనీకి తీసుకువచ్చారు.ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంగుల దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లగా హనుమాన్ విగ్రహ పునః ప్రతిష్టాపనకు తాను వస్తానని చెప్పి వర్షాన్నిసైతం లెక్కచేయకుండా వెళ్లి విగ్రహ పున ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ బొమ్మకల్ గ్రామపంచాయతీగా ఉన్న సందర్భంలోనే సుమారు 1989వ సంవత్సరంలో 125వ సర్వే నెంబర్లో ప్లాటింగ్ చేశారని అప్పుడు కాలనీ ఏర్పడేందుకు ప్లాటింగ్ చేసిన స్థలంలో 10 శాతం భూమిని పాఠశాలలకు గాని ఆలయానికి కానీ లేదా కమ్యూనిటీ పర్పస్ వదిలిపెట్టాలని నిబంధన ఉన్నందున 125 సర్వే నంబర్లో కాలనీ వాసులందరూ కలిసి 20 ఏళ్లుగా ఈ స్థలంలో బతుకమ్మ వేడుకలు వినాయక నవరాత్రి ఉత్సవాలు దుర్గ నవరాత్రి ఉత్సవాలు ఇలా జరుపుకోవడంతో పాటు ఈ స్థలంలో హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని తాత్కాలిక గుడి నిర్మించుకున్నారని తెలిపారు.ఐతే ఏడాది కాలం క్రితం నుండిఈ ల్యాండ్ పైన భూ కబ్జాదారుల కన్ను పడిందని అప్పటినుండి ల్యాండ్ ను కబ్జాకు ప్రయత్నిస్తూనే ఉన్నారు.చివరకు గత నాలుగు రోజుల క్రితం హనుమాన్ విగ్రహాన్ని ఇకనుండి దొంగిలించి ఇక్కడ ల్యాండ్ కు ఫెన్సింగ్ వేశారన్నారు.విషయం కాలనీ వాసుల ధ్వారా తెలుసుకొని స్వయంగా తానే దగ్గర ఉండి విగ్రహాన్ని ప్రతిష్ట చేశామన్నారు.మళ్ళీ ఇటువంటి చర్యలు పునరావృతం అవుతే కరీంనగర్ బందుకి పిలుపునిచ్చి హిందువులందరిని తీసుకవచ్చి గుడి కడతానని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ గాదే రూప -శ్రీనివాస్, నాయకులు తోట కిరణ్,లక్ష్మన్,అశోక్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





## వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యం

**కార్మికుల ఉపాధి కల్పనకు చర్యలు**

**ప్రభుత్వ విప్,**
**వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

వేములవాడ/రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇందిరమ్మ మహిళా శక్తి చీరల వస్త్ర సేకరణ, నేతన్న పొదుపు పథకం ప్రారంభ కార్యక్రమం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం టెస్కొ మరియు చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ , పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ , జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పలు ప్రతిష్టాత్మక పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం పెంపొందించాలని, నాణ్యమైన చీరలు అందించాలని సదుద్దేశంతో.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుందని తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కు రూ. 300 కోట్ల బాకాయిలు చెల్లించామని గుర్తు చేశారు. గత ఏడాది కోటి చీరలు ఉత్పత్తి చేయించామని, ఈ ఏడాది మొదటి విడత కింద మూడు కోట్లకుపైగా మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్ ఇచ్చామని, ఇందులో 91 లక్షల మీటర్ల చీరలు ఇప్పటివరకు ఉత్పత్తి చేశారని వెల్లడించారు. గత ఏడాది కోటి చీరలు పంపిణీ చేశామని గుర్తు చేశారు.. 4000 మంది మరమగ్గాల కార్మికులు, 1500 మంది అనుబంధ రంగాల కార్మికులకు ఉపాధి దొరుకుతుందని వెల్లడించారు.

సిరిసిల్ల వస్త్రక్పరిశ్రమ బాధ్యులు కార్మికులు ఉపాధి భవిష్యత్తుపై ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి లక్ష్యంగా రూపాయలు 50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేశామని, క్రెడిట్ పై వస్త్ర పరిశ్రమకు అందిస్తున్నామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్, తదితర వసతులపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తామని వెల్లడించారు. సిరిసిల్లలో అధునాతన యంత్రాలు తీసుకురావాలని సూచించారు.

**సిరిసిల్లలో నాణ్యమైన చీరలు ఉత్పత్తి**

కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించాలని ఉద్దేశంతో ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని దేవాదాయ శాఖ , పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. త్వరలో రెండో చీర ఆకు పచ్చ రంగు చీరలు ఇవ్వనున్నామని వివరించారు. సిరిసిల్ల చీరకు మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. త్వరలో మరిన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ధర్మవరం, కంచి నమూనా లో ఇక్కడ కూడా వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తులు తయారు అవుతున్నాయని వివరించారు. ఉపాధి అవకాశాలు మరిన్ని పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

సిరిసిల్ల టెక్స్టైల్ ఇండస్ట్రీలో 2.0 మొదలు అయిందని తెలిపారు. నేతన్న పొదుపు పథకం (త్రిఫ్ట్) కార్మికుల కోరిక మేరకు రెండేళ్ల కాల పరిమితితో ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. దీనిలో కార్మికులను వేతనాల నుంచి 8% ప్రభుత్వం నుంచి 8 శాతం జమ చేస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా మరమగ్గాల, అనుబంధ రంగాలకు చెందిన 5,534 మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. ఈ స్కీమ్ ద్వారా వచ్చే డబ్బులు వారి కుటుంబాలకు ఉపయోగ పడుతాయని తెలిపారు. గత ఏడాది 12 కోట్ల రూపాయలను కార్మికులకు పంపిణీ చేశామని గుర్తు చేశారు.

**కార్మికులకు ఉపాధి..**

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సిరిసిల్లలో గత ఏడాది ఇందిరా మహిళా శక్తి చీరలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి దొరికిందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. చీరల ఉత్పత్తి ప్రక్రియను గత ఏడాది మహిళా సంఘాల బాధ్యులతో కలిసి తాను పరిశీలించానని గుర్తు చేశారు. మహిళలందరూ చీరల రంగు, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. సిరిసిల్లలో నాణ్యమైన చీరలు ఉత్పత్తి అవుతున్నాయని వివరించారు. అన్ని కార్యక్రమాలు, పండుగలకు ఇవే చీరలు కట్టుకుంటున్నారని తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బాధ్యులు నాణ్యమైన చీరలు ఉత్పత్తి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, చేనేత జౌళి శాఖ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అబద్ధాల పునాదుల మీద బిఆర్ఎస్ పుట్టింది

**బిఆర్ఎస్ హాయంలో ఇదే సీజన్ లో 7 టిఎంసి లస్టోరేజ్ అధికారిక రికార్డులు చూపించిన సుడా చైర్మన్**

**మానేర్ డ్యాం సందర్శించి ఎమ్మెల్యే గంగులకు సవాల్ విసిరినసు డా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



కరీంనగర్,జూన్ 27(వాయిస్ టుడే): మానేరు డ్యాంలో నీళ్లు లేవని తాగునీటికి కూడా సరిపోవని కేసీఆర్ హాయంలో ఎన్నడూ డ్యాం నీటిమట్టం టిఎంసిల కంటే తగ్గలేదని ప్రజలను తప్పుదోవపట్టిస్తూ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డ్యాంలో ఆటలు ఆడి డ్రామాలాడారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు.ఉదయం గంగుల డ్యాంకు వెళ్లి ఆటలాడుతే సాయంత్రం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధికారులు నాయకులు కార్యకర్తలతో వెళ్లి నీటిని పరిశీలించి మీ హాయంలో ఇదే సీజన్ లో 15 టిఎంసిల కంటే ఎన్నడూ తగ్గలేదన్నావ్ గదా ఇదిగో అధికారిక ఆధారాలు చూపిస్తున్న దమ్ముంటే నాసవాలును స్వీకరించు నిరూపిస్తే నేను ముక్కు నేలకు రాస్తా నిరూపించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్ అని నరేందర్ రెడ్డి సవాల్ విసిరారు.ఇప్పుడున్న 5.8 టిఎంసిలలో డెడ్ స్టోరేజ్ పోను 2 టిఎంసిలు నీళ్లు రాబోయే నెలల వరకు కరీంనగర్ నగర ప్రజల త్రాగు నీటికి మిషన్ భగీరథకు సరిపోతుందని ఈ లోగా వర్షాలు కురుస్తాయని ఒకవేళ ఇంకా ఇబ్బందయితే మిడ్ మానేరులో 4 టిఎంసిలు అదనంగా ఉన్నాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.కమీషన్ల కక్కుర్తితో కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసింది చాలక కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేస్తే నీళ్లు వచ్చేవని మాట్లాడుతున్నారని అదేమన్నా ప్యాచ్ వేస్తే ఆగేదా అని ఎద్దేవా చేశారు.ఇటువంటి డ్రామాలు, అబద్ధాలు ఆపకపోతే మీరు డ్యాంలో ఫుట్ బాల్ ఆడింద్రు గదా ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానకపోతే ప్రజాక్షేత్రంలో ప్రజలే మిమ్ములను ఫుట్ బాల్ ఆడుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కార్పోరేటర్ పర్వతాల మల్లేశం,గోపు మల్లారెడ్డి,లయాక్,చర్ల పద్మ,నెల్లి నరేష్,షబానా మహమ్మద్,ముల్కల కవిత,జ్యోతి రెడ్డి,అస్థాపురం తిరుమల,మహాలక్ష్మి,కంది అశోక్ రెడ్డి,బషీర్, షెహన్షా,మాసుం ఖాన్, రాజ్ కుమార్,హనీఫ్,అనిల్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ ఒంటెత్తు పోకడతో రైతులకు కష్టాలు

**మాజీ మంత్రి గంగుల కమలాకర్**

**కరువు వచ్చినప్పుడే ఆదుకునేదే కాళేశ్వరం ప్రాజెక్ట్**

**రెండున్నర ఏళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును కెసిఆర్ పూర్తి చేసి ప్రజలకు సాగు, త్రాగునీరు**



కరీంనగర్,జూన్ 27(వాయిస్ టుడే): ఎల్ఎండి జలాశయం అడుగంటడంతో కరీంనగర్ నగర ప్రజలకు,హుజురాబాద్, మానకొండూరు నియోజకవర్గం రైతులకు సాగునీరుకు ఇబ్బందులు మొదలైన దృష్ట్యా నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎల్ఎండిలో వినూత్న కార్యక్రమంతో నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ హాజరై పార్టీ శ్రేణులతో కలిసి అడుగంటిన జలాశయంలో ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా ఆటలను ఆడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్ రెండు దశాబ్దాల చరిత్రలో జూలై మాసంలో ఎల్ఎండి నీటి నిల్వలు డేడ్ స్టోరేజ్ కి పడిపోవడం ఇదే మొదటిసారి అని.కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజలకు త్రాగునీరు సాగునీరు అందకుండా పోతుందన్నారు. మేడిగడ్డను మరమ్మత్తు చేయకపోవడం ద్వారా ప్రతిరోజు 10 నుంచి 15 వేల క్యూసెక్కుల నీరు రాజమండ్రి ద్వారా సముద్రంలో కలుస్తుందని,ఆ నీటిని నిల్వ చేసి మేడిగడ్డ నుండి కన్నెపల్లి,సుందిళ్ల,అన్నారం, ఎల్లంపల్లిలకు తరలించి ఎల్లంపల్లిలో మోటార్లను ఆన్ చేసి వరద కాల ద్వారా మిడ్ మానేరు,ఎల్ఎండి లను నీటితో నింపాలన్నారు.అదేవిధంగా మిడ్ మానేరుపై ఆచంపల్లి దగ్గర ఉన్న తూము ద్వారా నీటిని విడుదల చేయడం ద్వారా కొత్తపెల్లి మండలంలోని బావు పేట, ఎలగందుల,నాగుల మల్యాల,బద్దిపల్లి, కమాన్పూర్,శ్రీరాములపల్లి,కాజీపూర్ గ్రామ చెరువులు నింపాలన్నారు.ప్రభుత్వం చేతకాదని చేతులెత్తేస్తే.కెసిఆర్ నాయకత్వంలో కేటీఆర్ హరీష్ రావు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి కన్నెపల్లిలో ఉన్న మోటార్లను ఆన్ చేసి ప్రజలకు నీరందిస్తామన్నారు.బేషాజాలకు పోకుండా ప్రజలకు నీరందించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం ఎల్ఎండిలో ఐదున్నర టీఎంసీలు మాత్రమే నిల్వ ఉందని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వర్షాలు పడే అవకాశం లేదన్నారు. మూడు టీఎంసీలు డెడ్ స్టోరేజ్ గా ఉంటుందని కేవలం రెండు టీఎంసీల నీటి ద్వారా కరీంనగర్ ప్రజలకు త్రాగునీరు అందించలేమన్నారు.బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రతిరోజు త్రాగునీరు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ప్రస్తుతం రెండు మూడు రోజులకు ఒకసారి మంచినీళ్లు అందిస్తున్నారని పేర్కొన్నారు.

పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇటు త్రాగునీరుకు కరీంనగర్ ప్రజలకు ఇబ్బంది తలెత్తుతుందని ఎల్ఎండి మీద ఆధారపడి వ్యవసాయం సాగు చేసుకుంటున్నా మానకొండూరు హుజురాబాద్ నియోజకవర్గ రైతులకు సాగునీరు లేక రైతులు రోడ్డున పడే పరిస్థితి ఉత్పన్నమవుతుందన్నారు.మా ప్రభుత్వ హయాంలో కాలేశ్వరం ప్రాజెక్టు నీటిని ఎత్తిపోసి ఏప్రిల్ మే మాసాలలోనే ప్రాజెక్టులన్నింటినీ నింపి తద్వారా చెరువులకు నీరును తరలించి మత్తుడులు దుంకించిన విషయాన్ని గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వహయాంలో ఎల్ఎండిలో ఎప్పుడు10:30 టీఎంసీలు నిలువ ఉండేవిధంగా ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కన్నెపల్లిలోని మోటార్లను ఆన్ చేసి మిడ్ మానేరు,ఎల్ఎండిలను నింపాలన్నారు.ప్రజలకు నీటిని అందించే వరకు పోరాడాతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బారాస కార్పొరేటర్లు,ఆయా గ్రామాల సర్పంచులు,మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు,డివిజన్ అధ్యక్షులు,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**

VOICE OF PRAJALU
వాయిస్



# అంగన్వాడీ చిన్నారుల ఆరోగ్యం,పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలి

## ప్రీ స్కూల్ హాజరు పెంచడంతో పాటు శామ్, మామ్ కేసులు తగ్గేలా కృషి చేయాలి

## డయేరియా బారిన పడకుండా విస్తృత అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ, (వాయిస్ టుడే) : అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యం,పోషణ,ప్రీ స్కూల్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. చిన్నారులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండడంతో పాటు అంగన్వాడీ కేంద్రాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించబడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ తరగతులు,విద్యార్థుల హాజరు,పోషణ్ అభియాన్ అమలు,ఐదేళ్ల లోపు పిల్లల ఎదుగుదలను,బరువును పరీక్షించడానికి శామ్ (శావీ), మామ్ (పీూవీ) పిల్లల పరిస్థితి తదితర అంశాలపై జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి విశ్వజ,ఐసీడీఎస్ సూపర్వైజర్లు,సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అంగన్వాడీ కేంద్రాలకు హాజరవుతున్న చిన్నారుల సంఖ్య,ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) ద్వారా హాజరు నమోదు,శామ్,మామ్ పిల్లల వివరాలు,పోషకాహార పంపిణీ తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరును తప్పనిసరిగా ముఖ గుర్తింపు విధానం ద్వారా నమోదు చేయాలని సూచించారు. ప్రీ స్కూల్ వయస్సు పిల్లలందరూ క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి,వారికి అవసరమైన పోషకాహారం అందిస్తూ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేలా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల లోపు పిల్లల ఎదుగుదలను,బరువును పరీక్షించడానికి శామ్, మామ్ పిల్లల ఇళ్లను అంగన్వాడీ టీచర్లు నిరంతరం సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడంతో పాటు తల్లిదండ్రులకు సమతుల్య పోషకాహారం,మంచి ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలని సూచించారు.

వర్షాకాలం నేపథ్యంలో చిన్నారులు డయేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా పరిశుభ్రత,సురక్షిత తాగునీటి వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు,వాటి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని,చిన్నారులకు అందించే ఆహారం తయారీలో వినియోగించే తాగునీరు కూడా నాణ్యంగా ఉండాలని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా జిల్లాలో నమోదవుతున్న శామ్,మామ్ కేసుల వివరాలను విశ్లేషించి వాటి తగ్గుదలపై అధ్యయనం చేయాలని,తీవ్ర పోషకాహార లోపం ఉన్న చిన్నారుల సంఖ్య గణనీయంగా తగ్గేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్లు తమ పరిధిలోని ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో సందర్శించి సేవల నాణ్యత,చిన్నారుల హాజరు,పోషకాహార పంపిణీ,పరిశుభ్రత తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి విశ్వజ,ఐసీడీఎస్ సిడిపిఓ లు, సూపర్వైజర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## బీసీ-ఎస్సీ-ఎస్టీ-మైనార్టీల రాజకీయ రాజ్యాధికారమే సమరభేరి లక్ష్యం: అఖిల్ పాషా

### గంగుల కమలాకర్‌కు ఆహ్వానం

కరీంనగర్,జూన్ 27(వాయిస్ టుడే): బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ బహుజన వర్గాలకు రాజకీయ రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 05న నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి సభకు హాజరుకావాలని కోరుతూ కరీంనగర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ఆధ్వర్యంలోని నాయకుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు రాజకీయంగా ఇంకా పూర్తి స్థాయిలో సాధికారత పొందలేదని అన్నారు. సామాజిక న్యాయం,సమాన రాజకీయ భాగస్వామ్యం,బహుజనుల పాలన అనే లక్ష్యాలతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. జూలై 05న జరిగే సమరభేరి సభ బహుజన రాజ్యాధికార ఉద్యమానికి కొత్త దిశను చూపే చారిత్రాత్మక సభగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్,మైనారిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అర్షత్ బిన్ అలీ,టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్,జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి ఇశ్రత్ శావాలి,నాయకులు మహబూబ్ అలీ పాల్గొన్నారు.

## విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నాం: మంత్రి పొంగులేటి



దానవాయిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని దానవాయిగూడెం టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ బాలికల కళాశాలలో రూ. 2.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, మరమ్మతు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న పేద కుటుంబాల విద్యార్థినీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యతోపాటు, అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాల్లో విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల డైట్ ఛార్జీలను 40శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200శాతం పెంచడం ద్వారా పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించామన్నారు. అనంతరం పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలంలోని గోళ్లపాడు, తీర్థాల గ్రామాల సమీపాన ఊటవాగు తండా వద్ద రూ. 6.75 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న చెక్‌డ్యామ్‌కు పొంగులేటి శంకుస్థాపన చేశారు.



## రైతు ఆశీర్వాద సభా ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్

చింతకాని : మండలంలోని మత్కేపల్లి అడ్డరోడ్డు వద్ద ఈ నెల 30వ తేదీ జరగనున్న రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ సభ ఏర్పాట్లను కలెక్టర్ దివాకర టీఎస్ , సీపీ సునీల్ దత్ శనివారం పరిశీలించారు. రైతు ఆశీర్వాద సభ నేపథ్యంలో 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజులపాటు రైతు ఎగ్జిబిషన్ మేళాతోపాటు వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. స్టాల్స్ ఏర్పాటు, సభా ప్రాంతాన్ని కలెక్టర్, సీపీ పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, వైరా ఏసీపీ సారంగపాణి, జిల్లాస్థాయి అధికారులు ఉన్నారు.

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి



ముదిగొండ: ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేశ్‌ను శనివారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమేష్ కథనం మేరకు.. ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన ఓ రైతు తన తండ్రి ఇచ్చిన ఐదు గుంటల స్థలంలో రేకుల గది నిర్మాణానికి, ఇంటి నంబర్ కోసం గత నెల 19న దరఖాస్తు చేసుకున్నాడు. ఇంటి నిర్మాణం అనుమతి, ఇంటి నంబర్ కేటాయించటానికి పంచాయతీ కార్యదర్శి సురేష్.. బాధితుడ్ని రూ .40వేలు లంచం డిమాండ్ చేశారు. అంత నగదు ఇచ్చుకోలేనని రూ .25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం ముదిగొండలోని రైతు వేదిక వద్ద బాధితుడి వద్ద నుంచి రూ. 25 వేలు లంచం తీసుకుంటుండగా సురేశ్‌ను రెడ్ హ్యాండ్‌డెగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. అనంతరం బాణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయానికి తీసుకొచ్చి విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న పలు రికార్డులను తనిఖీ చేశామన్నారు.




## అలయన్స్ గ్రీన్ పోస్టర్ అవార్డ్స్‌కు శ్రీకారం

### అచీవర్స్ స్కూల్‌లో పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్,జూన్ 27(వాయిస్ టుడే): అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్,డిస్ట్రిక్ట్ 137 ఏ కరీంనగర్ మరియు వాసుదేవా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న అలయన్స్ గ్రీన్ అవార్డ్స్ పోస్టర్ డ్రాయింగ్ పోటీని అచీవర్స్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభించారు. అలయన్స్ ఇంటర్నేషనల్ ఈ ఏడాది ప్రకృతి ప్రేరణ మన భవిష్యత్తు కోసం వాతావరణం అనే థీమ్‌తో ఈ పోటీని నిర్వహిస్తోంది. ఈ పోటీలో 4 నుండి 8 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు మొదటి కేటగిరీగా,9 నుండి 13 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు రెండవ కేటగిరీగా పాల్గొనవచ్చు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈ పోటీలో పాల్గొనే అవకాశం కల్పించారు. విద్యార్థులు రూపొందించిన పోస్టర్లను జూలై 13వ తేదీలోపు అలయన్స్ జిల్లా గవర్నర్ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. అనంతరం వాటిని ఇంటర్నేషనల్ స్థాయికి పంపిస్తారు. విజేతలకు బహుమతులు అందజేయబడతాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థుల ఉత్తమ చిత్రాలను అలయన్స్ ఇంటర్నేషనల్ మ్యాగజైన్‌లో ప్రచురిస్తామని తెలిపారు. ప్రకృతి మనకుప్రసాదించిన గాలి,నీరు,చెట్లు,భూమి వంటి అమూల్యమైన వనరులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పచ్చదనాన్ని పరిరక్షిద్దాం మన భవిష్యత్తును కాపాడుదాం అనే సందేశంతో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలయన్స్ గ్రీన్ పోస్టర్ అవార్డును జిల్లా స్థాయిలో తొలిసారిగా అచీవర్స్ స్కూల్‌లో స్కూల్ చైర్మన్ చెరిమాల వెంకటేశ్వర్లు అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ శ్రీనివాస్, స్కూల్ చైర్మన్ చెరిమాల వెంకటేశ్వర్లు,జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్,ఇంజనీర్ కోల అన్నారెడ్డి, కుమారస్వామి,నాగేశ్వర్,పుల్లెల శ్యామ్,సుద్దపల్లి ప్రసాద్,అల్లాడి ఆనంద్ కుమార్,అచీవర్స్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



సిరిసిల్ల,జూన్ 27(వాయిస్ టుడే): నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా విద్యార్థుల ఆవేదనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్ ఆధ్వర్యంలో సిరిసిల్ల బ్రిడ్జిపై నిరసన కార్యక్రమం నిర్వహించి బ్రిడ్జిపైన బైఠాయించారు. ఈ సందర్భంగా కౌడగాని వెంకటేష్ మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీ వల్ల 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే బర్తరఫ్ చేసి పరీక్షలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే సిరిసిల్ల నియోజక వర్గ అధ్యక్షుడు చుక్కా రాజశేఖర్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విద్యార్థులకు క్షమాపణ చెప్పి వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని చెప్పి డిమాండ్ చేశారు. 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బిజెపి ప్రభుత్వం చేతగానితనాన్ని విద్యార్థులకు చేసిన మోసాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని త్వరలోనే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 80 కి పైగా పరీక్ష పత్రాలు లీక్ అయ్యాయని ఇది బిజెపి ప్రభుత్వం చేతగానితనం అని చెప్పి అన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయకపోతే దేశ యువజన కాంగ్రెస్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిరసనలు తెలుపుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కౌడగాని వెంకటేష్, యూత్ కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు చుక్కా రాజశేఖర్,వేములవాడ నియోజవర్గ అధ్యక్షుడు న్యాత నవీన్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిదులు రెడ్డిమళ్ళ భాను,గుడిసె ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగం మురళి,శేఖర్ శౌర్య నాయక్,ఎడ్ల తిరుపతి, వేములవాడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్,సిరిసిల్ల టౌన్ అధ్యక్షులు పోగుల దేవరాజు రెడ్డి, తంగలపల్లి మండల అధ్యక్షులు ఎగుర్ల ప్రశాంత్,గంభీరావుపేట మండల అధ్యక్షులు గంగోల్ల స్వామి, చుక్క రామస్వామి,దండుగుల శేఖర్, నక్క సాయి,ఎండీ సోహెల్,నక్క నవీన్,శ్యాగ కుమార్,రాగుల చరణ్, షేక్ ఇర్ఫాన్ మరియు పాల్గొన్నారు.



## అంగన్వాడి ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్

### ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిని

వేములపల్లి జూన్ 27: ఐసిడిఎస్ దామచర్ల ప్రాజెక్టు పరిధిలోని వేములపల్లి మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడి టీచర్ల పోస్టులను భర్తీ చేసేందుకు గాను ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ఐసిడిఎస్ సూపర్వైజర్ పరిమి రజిని తెలిపారు ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ హేమలత, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దండ జితేందర్ రెడ్డి, లకు నోటిఫికేషన్ పత్రాలను అందజేయడంజరిగిందన్నారు. మండలంలోని రావులపెంట 2, ఎస్సీ గ్రూప్ వన్ కేటగిరి, కామేపల్లి, ఓపెన్ క్యాటగిరి, రావువారిగూడెం బిసి బి కేటగిరి,ఆమనగల్లు గ్రామపంచాయతీలలో అంగన్వాడీ టీచర్ పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్ పత్రాలనగ్రామపంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకుఅందజేసి నోటీసు బోర్డులో పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు అంగన్వాడి సిబ్బంది పుట్టల జయమ్మ తదితరులు పాల్గొన్నారు.